ఫ్యాన్‌కు చెమటలు

భారీగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

- మొత్తం.. 26,150.. పోలైనవి 21,583..
- ఇప్పటివరకూ 82.53 శాతం నమోదు
- గతంలో 50 శాతానికి మించని వైనం
- ప్రభుత్వ వ్యతిరేకతతో పెరిగిన పోలింగ్



పోస్టల్‌బ్యాలెట్ ఓటు వేయడానికి క్యూకట్టిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు

అనంతపురం టౌన్, మే 9: ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో భారీ స్థాయిలో పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా 26,150 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటుకు దరఖాస్తు చేశారు. వీరిలో ఇప్పటి వరకూ 21,583 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. అనంతపురం అర్బన్‌లో అత్యధికంగా 5,478 మంది ఓటు వేశారు. రాప్తాడులో 3,043 మంది ఓటు హక్కు వినియోగించుకుని రెండో స్థానంలో నిలిచారు. పోస్టల్ బ్యాలెట్ ఓటర్లలో అంతర్ జిల్లావారు 2,231 మంది ఉండగా, 1,478 మంది ఓటు వేశారు. ఇప్పటి వరకూ 82.53 శాతం పోలింగ్ నమోదైంది. అత్యవసర సేవలు అందించే మరో 33 శాఖల ఉద్యోగులకు శుక్రవారం వరకూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారు. దీంతో పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉంది.ఈ నెల 3 నుంచి జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభమైంది. విపరీతమైన ఎండలు, ఉక్కపోత అల్లాడిస్తున్నా వేతన జీవులు ఏమాత్రం వెనకడుగు వేయలేదు. గంటల కొద్దీ వేచి చూసి మరీ తమ హక్కును వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు చుట్టూ తొలి రోజు నుంచి వివాదాలు అలుముకున్నాయి. తక్కువ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం, ఫారం-12 సమర్పించినా ఓటరు జాబితాలో పేర్లు లేకపోవడంతో పలువురు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారుల తీరుకు నిరసనగా ఆందోళనకు దిగారు. దీంతో పోలింగ్ గడువును ఆరో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకూ పొడిగించారు. అప్పటికీ ఓటు హక్కు వినియోగించుకోలేనివారికి గురువారం 9వ తేదీ కూడా అవకాశం ఇచ్చారు.

ఎన్నడూలేనంతగా..

జగన్ విపక్ష నేతగా ఉన్న సమయంలో పాదయాత్ర చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు సీపీఎస్ సహా అనేక హామీలు ఇచ్చారు. జగన్ మాటలను నమ్మి.. ఆ వర్గాలు గంపగుత్తగా వైసీపీకి ఓట్లు వేశాయి. అధికారంలోకి వచ్చాక జగన్ హామీలను విస్మరించారు. పీఆర్సీ, హెచ్ఆర్ఏ, సీపీఎస్ అంశాలను ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రశ్నిస్తే.. కట్టడి చేశారు. ఆందోళనలకు దిగితే అణచివేశారు. మానసికంగా వేధించారు. ఈ నేపథ్యంలో అవకాశం కోసం ఇన్నాళ్లు వేచి చూసిన ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు వైసీపీకి వ్యతిరేకంగా 'ఓటెత్తినట్లు' స్పష్టంగా కనిపిస్తోంది. అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న ఉపాధ్యాయ సంఘాలు పోస్టల్ బ్యాలెట్ ఓటు శాతాన్ని తగ్గించేందుకు ప్రయత్నించాయి. మరోవైపు ఓటుకు నోటు ఇవ్వాలని చూశారు. ఫెసిలిటేషన్ కేంద్రాల వద్ద తిష్టవేసి పలురకాలుగా ప్రలోభాలకు గురిచేశారు. అయినా ఎవరూ బెదరకుండా తమ హక్కును వినియోగించుకున్నారు. గతంలో ఎప్పుడూ 50 శాతానికి మించి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరిగేది కాదని, ఇప్పుడు ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత కారణంగా ఏకంగా 82.53 శాతం ఓటింగ్ జరిగిందని భావిస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో 80 శాతానికి పైగా ఉద్యోగ, ఉపాధ్యాయవర్గాలు టీడీపీ కూటమికి అనుకూలంగా ఓటు వేసినట్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ఇలా..

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
రాయదుర్గం	1,877	1,334
ఉరవకొండ	2,124	2,036
గుంతకల్లు	3,032	2,493
తాడిపత్రి	2,388	2,034
శింగనమల	1,810	1,586
అనంతపురం అర్బన్	6,594	5,478
కళ్యాణదుర్గం	2,566	2,107
రాప్తాడు	3,528	3,043
అంతర్ జిల్లాల ఓటర్లు	2,231	1,478

ఈ మాత్రం చాలు..

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ చూశాక ఫ్యాన్ పార్టీకి చెమటలు పడుతున్నాయి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు అత్యధికంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు వేశారని వైసీపీ అనుకూల సంఘాల నాయకులే చెబుతున్నాయి. ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో కూడా వారి కుటుంబాలు ఇదే స్థాయిలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు వేయడం ఖాయంగా కనిపిస్తోంది. ఒక్కో ఉద్యోగి కుటుంబం నుంచి సగటున నాలుగు ఓట్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పడతాయని, అధికార పార్టీ అభ్యర్థుల ఓటమికి ఈమాత్రం చాలని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

యానిమేటర్లతో వైసీపీ సమావేశం

తెలిసినా పట్టించుకోని అధికారులు



సమావేశం నుంచి బయటకు వెళ్లిపోతున్న యానిమేటర్లు.. ఫిర్యాదు చేస్తున్న కేశవ్



ఉరవకొండ మే 9: ఎన్నికలలో మహిళలను ప్రలోభపెట్టేందుకు అధికార పార్టీ కుయుక్తులు పన్నుతోంది. ఉరవకొండ పట్టణంలోని చౌడేశ్వరి కాలనీలో యానిమేటర్లతో మాజీ ఎంపీపీ చంద్రమ్మ గురువారం రహస్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే విశ్వ ప్రధాన అనుచరుడు పాల్గొనడం గమనార్హం. విషయం తెలుసుకున్న ఎన్నికల అధికారులు అక్కడికి చేరుకున్నారు. వారిని చూడగానే మాజీ ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు అక్కడి నుంచి జారుకున్నాడు. యానిమేటర్లు అధికారుల కళ్లెదుటే సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. అయినా వారిని అధికారులు విచారించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. వైకేపీ అధికారుల సహకారంతోనే యానిమేటర్ల సమావేశం జరిగినట్లు తెలుస్తోంది. ఇదివరకే ఉరవకొండలో యానిమేటర్లతో వైసీపీ నాయకులు సమావేశాలు నిర్వహించినా వైకేపీ అధికారులు పట్టించుకోలేదు.

తొత్తులుగా మారారు: మండిపడ్డ కేశవ్

అధికారపార్టీ నాయకులకు వైకేపీ అధికారులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని టీడీపీ కూటమి అభ్యర్థి పయ్యావుల కేశవ్ మండిపడ్డారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ కేతన్‌గార్గ్‌ను కలిసి యానిమేటర్ల సమావేశంపై ఆయన లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మాజీ ఎంపీపీ చంద్రమ్మ ఈ నెల 7న పట్టణానికి చెందిన యానిమేటర్లతో తన ఇంట్లో సమావేశం నిర్వహించారని, ఈ సమావేశంలో విశ్వ కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారని ఆయన అన్నారు. డ్వాక్రా సభ్యులతో ఓటు వేయిస్తే ముక్కు పుడకలు పంపిణీ చేస్తామని ప్రలోభపెట్టారని అన్నారు. సమావేశం నిర్వహిస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదు చేసినా, అక్కడికి ఆలస్యంగా చేరుకున్నారని అన్నారు. ఎంసీసీ కానిస్టేబుల్ వచ్చిన బైక్‌లోనే మాజీ ఎమ్మెల్యే వ్యక్తిగత పీఏ పారిపోతున్న విజువల్స్ ఉన్నాయని అన్నారు. డ్వాక్రా సభ్యులు కూడా హడావుడిగా పరుగులు పెట్టారని తెలిపారు. ఈ వ్యవహారం వెనుక డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, ఏపీఎం శివయ్య పాత్ర ఉందని ఆరోపించారు. ఎవరి కోసమో పని చేసి జీవితాలను బలిచేసుకోవద్దని ఆయన యానిమేటర్లను కోరారు. రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మాటలు వింటే శాశ్వతంగా క్రిమినల్ కేసులో ఇరుక్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆయన మాటలు విన్న అధికారులు కూడా సస్పెండ్ అయ్యారని గుర్తు చేశారు.

నేను చేసిన అభివృద్ధే నన్ను గెలిపిస్తుంది

టీడీపీ కూటమి రాయదుర్గం అభ్యర్థి కాలవ శ్రీనివాసులు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



తెలుగుదేశం పార్టీ గెలుపుతోనే రాయదుర్గం నియోజకవర్గం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుందని టీడీపీ కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు అన్నారు. 2014-19 మధ్యలో తాము చేసిన అభివృద్ధిని ప్రజలు కళ్లారా చూశారని అన్నారు. ఉంతకల్లు రిజర్వాయర్, బీటీపీకి కృష్ణా జలాలు, రాయదుర్గం జీన్స్ పరిశ్రమ అభివృద్ధి, ఫ్లై ఓవర్ల నిర్మాణం, రోడ్ల విస్తరణ, వైద్యశాలల నిర్మాణం, జూనియర్ కళాశాల మంజూరు లాంటివి ఎన్నో చేసి గర్వంగా ప్రజల ముందుకు ఓటు అడిగేందుకు వెళుతున్నానని అన్నారు. ఇప్పుడు కూడా తనను గెలిపిస్తే రాయదుర్గం రూపురేఖలు మార్చేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళతానని అన్నారు. లక్ష ఎకరాలకు సాగునీరు ఇస్తామని, ఇనుప ముడిఖనిజపు పరిశ్రమలను ఏర్పాటు చేయిస్తామని అన్నారు. ప్రజల పక్షాన ఐదేళ్ల పాటు చిత్తశుద్ధితో పోరాడామని, ప్రజా సంక్షేమం కోసం తాను అహర్నిశలు శ్రమిస్తాననే విషయం నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసని అన్నారు. సమర్థతకు, అసమర్థతకు మధ్య, ధనవంతుడికి, గుణవంతుడికి మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల సమరంలో ఖచ్చితంగా ప్రజలు తనను గెలిపిస్తారని విశ్వసిస్తున్నానని అన్నారు. గెలిచాక ప్రజలకు పాలేరులా పని చేస్తానని మాట ఇస్తున్నానని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఆయన ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు.

● **ప్రజలు మీకే ఎందుకు ఓటు వేయాలి?**

కాలవ: వెనుకబడ్డ రాయదుర్గం నియోజకవర్గంపై నాకు సమగ్ర అవగాహన ఉంది. ఎమ్మెల్యేగా, మంత్రిగా రూ.4500 కోట్ల నిధులతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశాను. నా లక్ష్యం రాయదుర్గం సర్వతోముఖాభివృద్ధే. అందుకు అవసరమైన ప్రతిపాదనలు ఇది వరకే సిద్ధం చేసి ఉంచాం. గతంలో నేను చేసిన అభివృద్ధి ప్రజలకు కళ్ల ముందు కనిపిస్తోంది. గెలిచి నాటి నుంచి ప్రజా సంక్షేమం కోసం పరితపించే నాయకుడిగా వారి కోసం పాలేరులా పని చేస్తాను. కాబట్టి ఓటు వేసి గెలిపించమని అడిగే అర్హత నాకు ఉంది.

● **మీ ముందున్న లక్ష్యం ఏమిటి?**

కాలవ: నియోజకవర్గంలో సాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. లక్ష ఎకరాలను సాగులోకి తెచ్చేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. గతంలోనే ఈ దిశగా పనులు చేశాను. ప్రభుత్వం మారడంతో నేను ప్రారంభించిన పనులు వివిధ స్థాయిల్లో ఆగిపోయాయి. వాటిని పూర్తి చేసి లక్ష్య సాధన దిశగా అడుగులు వేస్తాం. బీటీపీకి కృష్ణా జలాల తరలింపు, హంద్రీనీవా కాలువ ద్వారా ఆవులదట్ల, మాల్యం బ్రాంచ్ కాలువల ద్వారా చెరువులకు నీరు అందించడం, హెచ్చెల్సీ ఆధునికీకరణ, ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణం, హగరి, వేదవతి నదులను జీవనదులుగా మార్చడం ప్రధాన అజెండాగా రూపొందించుకున్నాం.

● **వైసీపీ ఐదేళ్ల పాలనపై మీ అభిప్రాయం...**

కాలవ: భూకబ్జాలు, ఇసుక దోపిడీ, ల్యాండ్ మాఫియా, దౌర్జన్యాలు, అక్రమ కేసులతోనే వైసీపీ ఐదేళ్ల పాలన పూర్తి అయింది. దీనికి తోడు ప్రజల నడ్డి విరిచేలా విద్యుత్, పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఆర్టీసీ చార్జీలను విపరీతంగా పెంచేశారు. ప్రజల అభివృద్ధి గురించి ఈ ప్రభుత్వం పట్టించుకోలేదు. కేవలం జేబులు నింపుకోవడంపైనే పాలకులు దృష్టిసారించారు. ప్రజల అవసరాల గురించి ఆలోచించలేదు.

● **ఇతర ప్రాధాన్య అంశాల గురించి వివరిస్తారా?**

కాలవ: రాయదుర్గాన్ని టెక్స్‌టైల్స్ హబ్‌గా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. తద్వారా వేలాది మందికి ఉపాధి లభిస్తుంది. ఈ రంగాన్ని మరింత విస్తృత పరిచి ఉపాధి కల్పిస్తాం. మూతపడ్డ కుట్టుశిక్షణ కేంద్రాన్ని పునఃప్రారంభించి నైపుణ్యాభివృద్ధి సాధిస్తాం. ఇనుప ఖనిజం ఆధారిత పరిశ్రమలను తీసుకురావడం ద్వారా మరింత మందికి ఉపాధి కల్పిస్తాం. పరిశ్రమలకు నిరంతర విద్యుత్ అందించడం కూడా మా లక్ష్య సాధనలో భాగం.

● **చాలా ప్రాంతాలకు నేటికీ తాగునీటి సమస్య ఉంది. ఎలా పరిష్కరిస్తారు..?**

కాలవ: ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందివ్వాలనేది నా సంకల్పం. ఇప్పటికే శ్రీరామిరెడ్డి పథకం ద్వారా పలు గ్రామాలకు తాగునీరు అందుతోంది. నియోజవకర్గం వ్యాప్తంగా అన్ని గ్రామాలకు ఈ పథకాన్ని ప్రారంభించడానికి రూ.191 కోట్లతో ప్రతిపాదనలు చేసి 2014-19 పనులు చేపట్టాం.

● **ప్రజల భాగస్వామ్యంతో ఏవైనా కార్యక్రమాలు చేపట్టారా?**

కాలవ: ఆర్థిక ఇబ్బందులతో బడి మానేసిన బాలికలకు ఉన్నత విద్యను అందించే లక్ష్యంతో ప్రజా భాగస్వామ్యం కోరాం. అది సత్ఫలితాలను ఇస్తోంది. అప్పట్లో పాఠశాలలో చేర్పించిన వారంతా నేడు ఉన్నత చదువులలో ఉన్నారు. ప్రజలను భాగస్వాములను చేసి నియోజకవర్గంలో ఏడు లక్షల మొక్కలు నాటించి, పచ్చదనం పెంపుకు కృషి చేశాం. వైద్యసేవలు అందరికి అందించాలన్న లక్ష్యంతో రాయదుర్గం ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా విస్తరించాము. కణేకల్లులో సీహెచ్‌సీ భవనం నిర్మించాం. పలు ప్రాంతాలలో పీహెచ్‌సీలు, ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయించాం. ప్రత్యేక వైద్యశిబిరాల ద్వారా కంటి ఆపరేషన్లు చేయించాం. పేదలకు పక్కా ఇళ్లు, అర్హులకు పింఛన్లు ఇప్పించాం. కర్ణాటక సరిహద్దులో రవాణా సౌకర్యాలు మెరుగు పడేలా రహదారుల విస్తరణ పనులు చేపట్టాం. గతంలో చేసిన అభివృద్ధే ఈ సారి నా గెలుపునకు దోహదపడుతుంది.

● **మీ గెలుపునకు అవకాశాలు ఎలా ఉన్నాయి?**

కాలవ: ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. పార్టీ క్యాడర్ ఉత్సాహంగా పనిచేస్తోంది. జనసేన, బీజేపీ వల్ల మరింత బలం చేకూరుతోంది. అందరి సహ కారంతో అత్యధిక మెజార్టీతో గెలుస్తామని ధీమాతో ఉన్నాం.

\- రాయదుర్గం

ఉష్ణోగ్రతలు

గరిష్ఠం	కనిష్ఠం
39.0	25.0

రాప్తాడును మరింత అభివృద్ధి చేస్తా..!

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- అధికారంలోకి రాగానే పేరూరుకు నీరు తీసుకొస్తాం
- జాకీ లాంటి పరిశ్రమను మళ్లీ రప్పిస్తాం
- టీడీపీ కూటమి రాప్తాడు అభ్యర్థి పరిటాల సునీత



ఆంధ్రజ్యోతితో మాట్లాడుతున్న పరిటాల సునీత

రాప్తాడు, మే 9: టీడీపీ హయాంలో రాప్తాడు నియోజకవర్గాన్ని రూ.5 వేల కోట్లతో అభివృద్ధి చేశామని మాజీ మంత్రి, టీడీపీ కూటమి అభ్యర్థి పరిటాల సునీత అన్నారు. ఈసారి అధికారంలోకి వచ్చిన వెంటనే మరింతగా అభివృద్ధి చేస్తామని ఆమె పేర్కొన్నారు. గెలిచిన వెంటనే పేరూరు డ్యాంకు నీరు తీసుకొచ్చి, ప్రతి ఎకరాకు సాగునీరు అందించేలా కృషి చేస్తామని అన్నారు. జాకీ లాంటి పరిశ్రమను తిరిగి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రజ్యోతితో ఆమె ప్రత్యేకంగా మాట్లాడారు.

● **ఎన్నికల ప్రచారం ఎలా జరుగుతోంది...?**

పరిటాల సునీత: గ్రామాల్లో మేము ప్రచారం చేస్తున్నట్లుగా లేదు. ఎక్కడ చూసినా విజయోత్సవంలా కనిపిస్తోంది. గ్రామాలకు గ్రామాలు కదిలి వస్తున్నాయి. ఎక్కడికి వెళ్లినా ప్రజలు అపూర్వ సాగతం పలుకుతున్నారు. తమ సొంత మనిషి ఊరికి వచ్చినట్లుగా నన్ను ఆదరిస్తున్నారు. పెద్ద ఎత్తున బాణ సంచా పేలుస్తూ.. పూల వర్షం కురిపిస్తున్నారు. గజమాలలు, హారతులతో ఘన స్వాగతం పలుకుతున్నారు. గత ఎన్నికల్లో జరిగిన తప్పును మళ్లీ జరగనివ్వబోమని స్పష్టంగా చెబుతున్నారు.

● **ప్రచారంలో వైసీపీ వాళ్లు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు కదా..? ఎలా ఎదుర్కొంటున్నారు..?**

పరిటాల సునీత: వైసీపీ వారికి ఓటమి తప్పదని అర్థమైంది. మాకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక పోతున్నారు. నిన్నటి వరకూ ఏదో గెలుద్దామని చూశారు. కానీ ఇప్పుడు వారికి కూడా నమ్మకం పోయింది. అందుకే మేము ఎక్కడికి వెళ్లినా కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు. రాళ్లు రువ్వుతున్నారు. మేము కూడా అదే స్థాయిలో సమాధానం చెప్పగలం. కానీ మా సిద్ధాంతం అది కాదు. వైసీపీ వారు పోలీసుల మీద కూడా దాడి చేసే స్థాయికి వెళ్లిపోయారు. మరో మూడు రోజుల్లో వైసీపీ అరాచకాలకు అడ్డు పడుతుంది.

● **ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి చేశామని చెబుతున్నారు. దీనికి మీరేమంటారు..?**

పరిటాల సునీత: ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి నోరు తెరిస్తే అబద్ధాలు చెబుతారు. పేరూరు డ్యాంకు నీరు ఇచ్చామంటారు. బంగారు గనులు తెరిపించామంటారు. పరిశ్రమలు తెచ్చామంటారు. సోలార్ ప్రాజెక్టులు తెచ్చామంటారు. లక్ష ఎకరాలకు నీరు ఇచ్చామంటారు. ఇందులో ఏ ఒక్కటైనా వాస్తవం ఉందా..? సొంత ఊరికి రోడ్డు వేయించుకోలేని అసమర్థుడు ప్రకాష్‌రెడ్డి. అతని మాటలకు జనం కూడా నవ్వుకుంటున్నారు. ఎవరైనా అభివృద్ధి పనుల్లో ఫ్రాడ్ చేస్తారు. కానీ ప్రకాష్‌రెడ్డి చెప్పే మాటల్లో కూడా ఫ్రాడ్ ఉంది. ఆయన మాయ మాటలు నమ్మేస్థితిలో ప్రజలు లేరు.

● **ఆరు మాసాలుగా టీడీపీలోకి భారీగా చేరికలు జరుగుతున్నాయి. దీనిపై మీరేమంటారు..?**

పరిటాల సునీత: వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలకు ప్రధానమైన కారణాలు రెండు ఉన్నాయి. రాష్ట్రం బాగుండాలి.. నియోజకవర్గం బాగుండాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారు. వైసీపీ నాయకుల్లో కూడా ఇదే అభిప్రాయం ఉంది. అందుకే నియోజకవర్గ వ్యాప్తంగా వైసీపీ నుంచి భారీగా టీడీపీలోకి చేరుతున్నారు. వలసలు పెరగడానికి ఇంకో ప్రధానమైన కారణం ఎమ్మెల్యే సోదరుల వ్యవహారం. గత ఎన్నికల్లో వైసీపీ నాయకులు ఆస్తులు అమ్మి ప్రకాష్‌రెడ్డిని గెలిపించారు. కానీ ఆయన గెలిచిన తరువాత కార్యకర్తల్ని, నాయకుల్ని కనీసం పలకరించిన పాపాన పోలేదు. పైగా వారినే ఇబ్బందులు పెడుతున్నారు. వారి భూములను లాక్కున్నారు. అందుకే వారు విరక్తి చెంది ప్రకాష్ రెడ్డిని ఓడించాలన్న లక్ష్యంతో టీడీపీలోకి వస్తున్నారు.

● **పేరూరు డ్యాంకు నీరు తీసుకువస్తారా..? బంగారు గనులను తెరిపిస్తారా..?**

పరిటాల సునీత: మేము అధికారంలోకి రాగానే మొదటి ప్రాధాన్యం.. పేరూరు డ్యాంకు నీరు ఇవ్వడమే. నాలుగు రిజర్వాయర్లు పూర్తి చేసి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయాలన్నదే మా తాపత్రయం. బంగారు గనులను తెరిపించే దిశగా టీడీపీ హయంలోనే అడుగులు పడ్డాయి. ఇది కేంద్రంతో మాట్లాడాల్సిన అంశం. జియోలాజికల్ శాఖ అధికారులతో మాట్లాడి గనులు తెరిపించేందుకు కృషి చేస్తాను. మేము ప్రకాష్ రెడ్డి మాదిరిగా అబద్ధాలు చెప్పం. చేసి చూపిస్తాం.

● **ప్రజల్లో పరిటాల కుటుంబానికి ఆదరణ ఎలా ఉంది...?**

పరిటాల సునీత: పరిటాల అనే పేరు ఎప్పటికీ ప్రజల్లో గుండెల్లో ఉంటుంది. నాతో పాటు మా కుటుంబ సభ్యులు ఈ సారి ప్రచారంలో పాల్గొన్నారు. మా కోడళ్లు, చెల్లెళ్లు, ఆడబిడ్డల ప్రచారాన్ని కూడా ప్రజలు బాగా ఆదరిస్తున్నారు. పరిటాల రవి చేసిన మంచి పనులు కొనసాగిస్తుండటంతోనే ప్రజలు మమ్మల్ని ఇంతలా ఆదరిస్తున్నారు.

● **ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు ఏం సందేశం ఇస్తారు...?**

పరిటాల సునీత: 2019లో ఒక తప్పు జరిగింది. తద్వారా రాష్ట్రం, నియోజకవర్గం అభివృద్ధిలో ఎంతో వెనుకబడ్డాయి. ప్రజలు కూడా ఎన్నో ఇబ్బందులు పడ్డారు. గత ఎన్నికల్లో ప్రకాష్‌రెడ్డి పేద అరుపులు, దొంగ ఓట్లతో గెలిచారు. ఈ సారి అలాంటి తప్పు జరగకూడదు. రాష్ట్రం బాగుండాలన్నా, రాప్తాడు అభివృద్ధి చెందాలన్నా టీడీపీకి ఓటు వేయండి. అరాచక పాలనకు చరమ గీతం పాడండి. ఇది మీ కోసం, మీ బిడ్డల కోసం అని నేను వేడుకుంటున్నాను.

● **అధికారంలోకి వచ్చిన తరువాత ఎలాంటి అభివృద్ధి చేస్తారు..?**

పరిటాల సునీత: అభివృద్ధి, సంక్షేమాన్ని అర్హులందరికీ అందిస్తాం. పేరూరుకు నీరందించే పనులు వేగంగా చేపడతాం. ప్రతి ఎకరాకు సారు అందించే ప్రయత్నం చేస్తాం. ఎమ్మెల్యే సోదరులు తరిమికొట్టిన జాకీ లాంటి పరిశ్రమలు మళ్లీ తీసుకొస్తాం. ఇక్కడ యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. గ్రామాల్లో సమస్యలను పరిష్కరిస్తాం. అధ్వాన్నంగా ఉన్న రోడ్లను బాగు చేయిస్తాం. ఐదేళ్ల వైసీపీ పాలనలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై ఎన్నో అక్రమ కేసులు పెట్టారు. ఆ కేసులను కొట్టివేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

చంద్రబాబుపై విమర్శలతో సరి

హామీలపై నోరెత్తని సీఎం జగన్

ఎప్పటిలాగే రోడ్ షోతో జనానికి కష్టాలు



ప్రయాణికులతో వెళుతున్న బస్సులను అడ్డుకుంటున్న పోలీసులు

కళ్యాణదుర్గం/రూరల్, మే 9: అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో సీఎం జగన్ రోడ్ షో యావత్తూ టీడీపీ అధినేత చంద్రబాబుపై విమర్శలు గుప్పించేందుకే కేటాయించారు. మేమంతా సిద్ధం పేరిట కళ్యాణదుర్గం పట్టణంలో గురువారం ఆయన పర్యటించారు. భైరవాన్ తిప్ప ప్రాజెక్టుకు కృష్ణాజలాల తరలింపు, 114 చెరువులకు నీరు వంటి గత ఎన్నికల హామీలను విస్మరించిన అయన.. ఈ ఎన్నికల్లో వాటి ప్రస్తావనే తేలేదు. నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేస్తారో కూడా చెప్పలేదు. 'మీ బిడ్డ మంచి చేసి ఉంటే చేతులెత్తండి' అని పదే పదే వైసీపీ కార్యకర్తలతో చేతులు ఎత్తించారు. ఆ తరువాత పార్టీ అభ్యర్థి తలారి రంగయ్యను పరిచయం చేసి సభను ముగించేశారు. జగన్ సభకు జనాలను సమకూర్చేందుకు వైసీపీ నాయకులు ముప్పతిప్పలు పడ్డారు. రాప్తాడు, రాయదుర్గం, ఉరవకొండ పట్టణాల నుంచి జనాలను సమీకరించారు. జన సమీకరణ కోసం ఒక్కో పోలింగ్ కేంద్రానికి రూ.40 వేల ప్రకారం మొత్తం 200 పోలింగ్ కేంద్రాలకు రూ.80 లక్షల వరకు డబ్బును వెదజల్లినట్లు సమాచారం. దారి పొడవునా మద్యం, బిర్యానీ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

జనానికి నరకం

సీఎం రాక నేపథ్యంలో పట్టణంలోని ప్రధాన వీధుల్లో ప్రతి వంద మీటర్లకు ఒక బారికేడ్ ఏర్పాటు చేశారు. సామాన్య ప్రజలు, ప్రయాణికులను రోడ్డు మీదికి రాకుండా అడ్డుకున్నారు. అనంతపురం, ధర్మవరం, హిందూపురం నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సులు, ఆటోలను పట్టణ శివారలోనే నిలిపేశారు. ప్రజలు అక్కడి నుంచి కాలినడకన పట్టణంలోకి చేరుకున్నారు. బస్సుల కోసం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు గంటల తరబడి వేచి చూశారు. బస్సులు ఇక్కడికి రావని, పట్టణ శివారులోకి వెళ్లి ఎక్కాలని అక్కడున్న సిబ్బంది చెప్పి పంపించారు. జగన్ ఎక్కడికి వెళ్లినా ఇదే పద్ధతి కనిపిస్తోందని, సామాన్యులను ఇబ్బంది పెట్టడం ఏమిటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈనాడు విలేకరిపై దాడి

జగన్ రోడ్ షోను చిత్రీకరిస్తున్న ఈనాడు విలేకరి రమేష్‌పై వైసీపీ వర్గీయులు దాడి చేశారు. సెల్‌ఫోన్ లాక్కుని పిడిగుద్దులు కురిపించారు. అక్కడున్న మిగిలిన విలేకరులు బాధితుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విలేకరిపై దాడిని టీడీపీ కూటమి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు ఖండించారు. ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు.

పోలీసులకైనా నో ఎంట్రీ



ఎన్నికల నిర్వహణలో పోలీసులదే కీలకపాత్ర అభ్యర్థుల ప్రచారాలు, సభలు, ర్యాలీలకు వారి అనుమతులు తప్పనిసరి. పోలింగ్ రోజు ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకొనేలా బందోబస్తు నిర్వహిస్తారు. అయినప్పటికీ పోలింగ్ కేంద్రం లోపలికి వెళ్లేందుకు వారికి అనుమతి లేదు. పోలింగ్ జరుగుతున్న సమయంలో ఎలాంటి సమస్య వచ్చినా కేంద్రంలోని ఎన్నికల అధికారే పరిష్కరిస్తుంటా రు. శాంతిభద్రతల సమస్య తలెత్తినప్పుడు ఎన్నికల అధికారి పిలిస్తే తప్ప ప్రత్యేక కారణం లేకుండా పోలీసులు పోలింగ్ కేంద్రంలోనికి పోవడానికి అనుమతి లేదు. పోటీ చేసే అభ్యర్థి అయినా, ఇంకా ముఖ్యమైన వ్యక్తి ఓటు వేసేందుకు వచ్చినా వారి భద్రతా సిబ్బంది మాత్రం పోలింగ్ కేంద్రం బయటే ఆగాలి. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి ఇబ్బంది కలిగించే ఏ పని కూడా ముఖ్యమంత్రి గాని, మంత్రులు గాని వారి అనుచరులు కాని చేయకూడదు. పదవుల్లో ఉన్నవారు పోలింగ్ కేంద్రంలో ఓటర్లను ప్రభావితం చేసేలా ప్రవర్తించకూడదు. ఎలాంటి మాటలు, సైగలు చేసినా నేరంగా పరిగణిస్తారు. పోలింగ్ సిబ్బంది రాజకీయ నాయకులు, మంత్రుల మాటలు పట్టించుకోకుండా ఎన్నికల సంఘం ఆదేశాలను మాత్రమే పాటించాలి.

- ముదిగుబ్బ

స్థానిక పోరును తలపించేలా...



స్థానిక పోరును తలపించేనా సార్వత్రిక ఎన్నికల సమరం జరుగుతోంది. సాధారణంగా ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలకు గ్రామీణులు అంత ప్రాధాన్యం ఇవ్వరు. ఎన్నికల రోజుకు స్థానికంగా ఉన్నవారితోనే ఓట్లు వేయిస్తారు. స్థానిక సంస్థల ఎన్నికలకు మాత్రం గ్రామాల్లోని ప్రతి ఓటరు వచ్చేలా చూస్తారు. అయితే ఈ సారి మాత్రం వలస వెళ్లిన వారిని ఎలాగైనా సొంత ప్రాంతాలకు తీసుకొచ్చి, ఓటు వేయించేలా ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రణాళికలు రూపొందించారు. అన్ని పార్టీల అభ్యర్థులు వలస ఓటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్న ఓటర్లను తరలించేందుకు ఎంత మొత్తంలో చెల్లిస్తున్నారో? ప్రయాణ ఖర్చులు ఏ మేరకు భరిస్తున్నారో తెలుసుకుంటున్నారు. గ్రామాల్లో సమా వేశాలు ఏర్పాటు చేసి వలస ఓటర్ల కోసం ఆరా తీస్తున్నారు. అంతకు మించి తాయిలాలు ఇచ్చి ఓటర్లను రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

- ముదిగుబ్బ

రేయ్.. పరిసిపారేయండ్రా..!

- తాడిపత్రిలో ఓటుకు రూ.2 వేలు
- ఇప్పటికే 95 శాతం పంపిణీ పూర్తి..?
- అవసరమైతే ఇంకో కోటా ఉంటుందట..!

తాడిపత్రి టౌన్, మే 9: రాష్ట్రంలో ఉత్కంఠ రేపే నియోజకవర్గాల్లో ఒకటైన తాడిపత్రిలో డబ్బులను పరిచి పడేస్తున్నారు. 'ఓటు ఎవరికైనా వేసుకో.. నువ్వు ఏ పార్టీ అయినా సరే.. నోటు తీసుకో..' అని మొహమాటం లేకుండా చెప్పేస్తున్నారు. ప్రలోభాలు పీక్స్‌కు చేరాయి. ఓటుకు రూ2 వేల ప్రకారం ఇప్పటికే పంపిణీ పూర్తి అయినట్లు విశ్వసనీయంగా తెలిసింది. తాడిపత్రి మున్సిపాలిటీతోపాటు గ్రామీణ ప్రాంతాలలో పోలింగ్‌కు మూడు రోజుల ముందే ఈ స్థాయిలో డబ్బులను పంచడం కలకలం రేపుతోంది. నియోజకవర్గంలో ఇప్పటికే వంద కోట్లు పంచేశారని అంటున్నారు.



ఎందుకంటే..

తాడిపత్రి నియోజకవర్గం జేసీ కుటుంబం కంచుకోట. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. ఇక్కడ మాత్రం జేసీ కుటుంబం జెండా ఎగరాల్సిందే అన్నట్లు రాజకీయం కొనసాగుతోంది. అంచనాలకు భిన్నంగా గత ఎన్నికల్లో మాత్రం ఓటమి ఎదురైంది. కానీ పడిలేచిన కెరటంలా మున్సిపల్ ఎన్నికల్లో జేసీ కుటుంబం సత్తా చాటుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాన్ గాలి వీచినా.. తమ అడ్డాలో మాత్రం కుదరదని 'సైకిల్' సంకేతం పంపింది. దీంతో ఈ ఎన్నికల్లో గెలుపుపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఎలాగైనా విజయం సాధించాలని ప్రధాన పార్టీల అభ్యర్థులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈ క్రమంలో ఓటర్లకు భారీగా డబ్బులు, చీరలు, ముక్కుపుడకలు వంటి కానుకలు చేరుతున్నాయి.

ఎంతైనా సరే..

తాడిపత్రి నియోజకవర్గంలో తాడిపత్రి, యాడికి, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు మండలాలు ఉన్నాయి. మొత్తం ఓటర్ల సంఖ్య 2,48,880. వీరిలో సాధ్యమైనంత మందికి డబ్బులు పంపిణీ చేయాలని అధికార పార్టీ ప్రయత్నిస్తోంది. ఇప్పటికే ఓటుకు రూ.2వేలు పంపిణీ చేశారని బహిరంగ చర్చ నడుస్తోంది. గ్రామీణ ప్రాంతాలలో నగదుతోపాటు కానుకలు కూడా ఇస్తున్నారట. ఇవికాక.. గంపగుత్త ఓట్ల కోసం పెద్ద ఎత్తున డిన్నర్లకు సిద్ధమవుతున్నారు. 'ఇప్పటికే పంచేశాం. ఇంకా అవసరమైనా ఇచ్చేద్దాం. ఏం జరుగుతోందో నిఘా వేయండి..' అని కిందిస్థాయి నాయకులను పురమాయించినట్లు తెలిసింది. మిగిలిన మూడు రోజులు ఓట్లు, మద్యం, కానుకల జాతరేనని అంటున్నారు.


బయటివారే సేఫ్

ఎన్నికల్లో డబ్బుల పంపిణీకి లెక్కాజమ ఉండదు. ఇచ్చిన సొమ్ము ఓటర్లకు చేరుతోందో లేదో తెలియదు. అందుకే లోకల్ వద్దు.. నాన్ లోకల్ మేలు అని అధికార పార్టీవారు బయటివారిని రప్పించినట్లు సమాచారం. సాధారణంగా చీకటి పడ్డాక, అర్ధరాత్రి సమయాల్లో గుట్టు చప్పుడు కాకుండా డబ్బుల పంపిణీ జరుగుతుంది. కానీ ఈ ఎన్నికల్లో 'మమ్మల్నెవరు ఆపేది..?' అన్నట్లుగా అధికార పార్టీవారు పట్టపగలే డబ్బులను పంచేస్తున్నారు. అధికారులు పట్టించుకోడం లేదని విమర్శలు వస్తున్నాయి.

గంటన్నరలో అయిపోవాలి..!

అనంతపురం క్రైం: జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో డబ్బుల పంపిణీకి అధికార పార్టీ అన్ని ఏర్పాట్లు చేసుకుంది. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు నాయకులు నోట్ల కట్టలను బయటకు తీస్తున్నారు. కొన్నిచోట్ల ఇప్పటికే పంపిణీ మొదలైంది. ఎక్కువ ప్రాంతాల్లో పోలింగ్‌కు రెండు రోజుల ముందు పంచాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఆ తరువాత రోజు చుక్క, ముక్క ఏర్పాటు చేస్తారని సమాచారం. 2019 ఎన్నికల్లో కూడా వైసీపీ నాయకులు ఇదే వ్యూహాన్ని అమలు చేశారు. అంత ఉత్కంఠ లేని ప్రాంతాలలో ప్రత్యర్థుల ఎత్తుగడలను పసిగట్టి.. అవసరమైతే ఓటుకు రూ.1500 పంచడానికైనా సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. గట్టి పోటీ ఉన్నచోట్ల ఎంత పంపిణీ చేస్తారో అంచనాలకు అందడం లేదని జనం వ్యాఖ్యానిస్తున్నారు. పంపిణీ బాధ్యతలు తీసుకున్న కీలక నేతల అనుచరవర్గాలు స్థానిక నాయకులకు కొన్ని సూచనలు ఇచ్చారట. తమ సమక్షంలో డబ్బులు పంచాలని షరతు పెట్టినట్లు సమాచారం. ఒక్కో ఇంట్లో ఎన్ని ఓట్లున్నాయో గుర్తించి, నిమిషాల వ్యవధిలో డబ్బులు ఇచ్చేయాలని.. ఊరు మొత్తం గంట.. గంటన్నరలోగా పంపిణీ పూర్తవ్వాలని స్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. పెద్ద గ్రామమైతే మరో అరగంట టైమ్ తీసుకోవాలని, అంతకంటే ఎక్కువ సమయం తీసుకోకూడదని సెలవిచ్చారట.

ఓటెలా అడుగుతావ్ జగనన్నా..



- ఇచ్చిన మాట తప్పితే ఓటేయొద్దని చెప్పావ్‌గా
- జిల్లాకు ఇచ్చిన ఏ హామీ నెరవేర్చావని ఓటెయ్యాలి
- ప్రాజెక్టులు పూర్తి చేయలేదు.. పరిశ్రమలు తేలేదు
- మాట తప్పావ్... మడమ తిప్పావ్
- వైసీపీకి ఓటుతోనే బుద్ధి చెప్తామంటున్న ప్రజానికం

అనంతపురం, మే 9(ఆంధ్రజ్యోతి) : 'ఇచ్చిన మాట తప్పితే ఓటు వేయొద్దని చెప్పిన దమ్మున్నోడే జగను... చెప్పిన మాట చెప్పినట్లుగా చేసిన మా రాజన్న కొడుకే జగను' అంటూ సాగే పాట ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్వహించిన ప్రతి బహిరంగ సభలోనూ వినిపిస్తోంది. అయితే ఆ పాటలో చెప్పినట్లుగా జగన్ ఏమాత్రం చేయలేదని జిల్లా ప్రజానికం మండిపడుతోంది. మాట తప్పం... మడమ తిప్పమని ప్రతి సభలోనూ ఫీంకరించే సీఎం జగన్ జిల్లాకిచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నది నిర్వివాదాంశం. ప్రాజెక్టులు పూర్తి చేయలేదు. మద్యపాన నిషేధాన్ని అమలు చేయలేదు. ఈ నేపథ్యంలోనే ఇచ్చిన మాట తప్పావ్... మరి నీ పార్టీకి ఓటెలా వేయాలని అడుగుతావ్ జగన్ అంటూ జిల్లా ప్రజానికం ప్రశ్నిస్తోంది. మాట తప్పిన... మడమ తిప్పిన జగన్‌కు ఎన్నికల్లో ఓటుతోనే బుద్ధి చెప్తామంటోంది.

ఏ ఒక్క హామీ అయినా నెరవేర్చారా..?

ప్రతిపక్ష నేత హోదాలో జిల్లాలో పాదయాత్ర చేశారు. ముఖ్యమంత్రి హోదాలోనూ బటన్ నొక్కుడు కార్యక్రమం పేరుతో అనేక సభలు నిర్వహించారు. ఈ జిల్లా మనవడినంటూ... కరువు జిల్లాను అన్ని విధాలుగా ఆదుకుంటానని అనేక హామీలిచ్చారు. ఆ హామీల్లో ఏ ఒక్కటైనా నెరవేర్చారా..? అంటూ జిల్లా ప్రజానికం ప్రశ్నిస్తోంది.

- జీడిపల్లి నుంచి కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీరందించేందుకు రూ. 986 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులకు రూ. 200 కోట్ల పరిహారం వారం రోజుల్లో ఖాతాల్లో జమ చేస్తానని కళ్యాణదుర్గం సభలో చెప్పావ్.. ఇప్పటి వరకూ నెరవేర్చలేదు.
- కృష్ణాజలాలను భైరవానితిప్ప ప్రాజెక్టుకు మళ్లిస్తానని హామీ ఇచ్చి మూడేళ్ల కాలం పూర్తయినా ఇప్పటికీ హామీగానే మిగిలిపోయింది. ఆ ప్రాజెక్టు పూర్తయితే... రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని 12 వేల ఎకరాలకు సాగునీరందేది. అదీ చేయలేదు.
- రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు వద్ద 4 టీఎంసీల సామర్థ్యంతో టీడీపీ హయాంలో చేపట్టిన నేమకల్లు ఆంజనేయస్వామి బాలెన్సింగ్ రిజర్వాయర్‌ను పూర్తి చేస్తామని హామీ ఇస్తివి. ఇప్పటికీ నెరవేర్చలేదు. జగన్ హామీ ఇస్తే నెరవేరుతాయని బొమ్మనహాళ్, కణేకల్లు, డి. హీరేహాళ మండలాల ఆయకట్టు రైతులు ఆశించారు. కానీ రైతన్నల ఆశలు ఆవిరి అయ్యాయి.
- జిల్లాకు సాగు, తాగునీరందించే హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులను పూర్తి చేస్తామని గొప్పగా చెబితివి. ఐదేళ్లలో గంప మట్టయినా తీయలేదు.
- చాగల్లు రిజర్వాయర్ నిర్మాణంతో ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి గ్రామాలను ముంపు గ్రామాలుగా గుర్తించారు. ఉల్లికంటిపల్లి గ్రామ ప్రజలకు పరిహారం కింద కొంత సొమ్ము మాత్రమే చెల్లించారు. నూతనంగా గ్రామాన్ని ఏర్పాటు చేసి గృహనిర్మాణాలు చేయించారు. ఆ గృహనిర్మాణాలకు ఇప్పటివరకూ నిధులివ్వలేదు. ఉల్లికల్లు గ్రామంలో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిపివేశారు. దీంతో గ్రామస్థులు ఆ గ్రామాన్ని వదల్లేక.. ఉండలేక అవస్థలు పడుతున్నారు.
- శింగనమల నియోజకవర్గంలో ఉద్యానపంటలు పండించే రైతులకు ఆదాయం పెంచేందుకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేకపోయారు.
- ఉరవకొండ నియోజకవర్గంలో హంద్రీనీవా ఉపకాలువల ద్వారా లక్ష ఎకరాలకు సాగునీటిని అందిస్తామని ప్రతిపక్ష నేత హోదాలో ఆందోళన చేపట్టావు... అధికారంలోకి రాగానే విస్మరించావని ఆ ప్రాంత రైతులు నిలదీస్తున్నారు.
- రాప్తాడు నియోజకవర్గంలోని చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లి గ్రామ సమీపంలో దేవరకొండ జలాశయంతో పాటు మరో రెండు రిజర్వాయర్లకు నాలుగేళ్ల కిందట వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసిందైనా గుర్తుందా జగనన్నా అంటూ ఆ నియోజకవర్గ ప్రజలు నిలదీస్తున్నారు.

ఇచ్చిన మాట తప్పితే ఓటు వేయొద్దని మీరే చెప్పారు. మరి ఓటేయమని ఇప్పుడు ఎలా అడుగుతున్నావ్ జగనన్నా అంటూ జిల్లా ప్రజానికం మండిపడుతోంది.

జిల్లాకు ఏం ఒరగబెట్టారని ఓటెయ్యాలి..?

విభజిత ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా లోటు బడ్జెట్ ఉన్నా... ఆగమేఘాల మీద గొల్లపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేసి, దాని ద్వారా నీటి సౌకర్యం కల్పించి కియతో పాటు అనుబంధ సంస్థలు ఏర్పాటయ్యేలా టీడీపీ అధినేత చంద్రబాబు కృషి చేశారు. కియ ద్వారా ప్రత్యక్షంగా 8 వేల మందికి, పరోక్షంగా 10 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించామని చెప్పుకునేందుకు తెలుగుదేశం పార్టీకి నైతికత ఉందన్న అభిప్రాయం జిల్లా ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. మరి కరువు జిల్లాకు ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క పరిశ్రమ అయినా తెచ్చారా? ఒక్కరికైనా ఉద్యోగం కల్పించారా..? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. టీడీపీ హయాంలో అనంతపురం నగర శివారులో దాదాపు 6 వేల మంది మహిళలకు ఉపాధి కల్పించే జాకీ పరిశ్రమను నెలకొల్పేందుకు ఆ సంస్థ ప్రతినిధులు సిద్ధమయ్యారు. అయితే అప్పటి ఎన్నికల్లో టీడీపీ అధికారం కోల్పోవడం... ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఎందుకు ఆ పరిశ్రమను ఏర్పాటు చేయలేకపోయిందో బదులివ్వగలరా అని ప్రజలు నిలదీస్తున్నారు. కాసుల కాంక్షతో అధికార వైసీపీ నేతలు ఆ పరిశ్రమ ప్రతినిధులపై ఒత్తిడి తేవడంతోనే పరిశ్రమ ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిందన్నది నిజం కాదా అని నిలదీస్తున్నారు. ఎంతసేపూ బటన్ నొక్కుడుతో సంక్షేమం చేపట్టామని చెబుతున్నారేగానీ... జిల్లా అభివృద్ధికి బాటలు వేయలేదన్నది నిజం కాదా అని వైసీపీ ప్రభుత్వాన్ని జిల్లా ప్రజానికం ప్రశ్నిస్తోంది. ప్రాజెక్టులు పూర్తయింటే ప్రతి ఎకరాకు సాగునీరు అందడం ద్వారా మా జీవితాలు బాగుపడేవన్న భావన జిల్లా రైతాంగం నుంచి వ్యక్తమవుతోంది. ఆ హామీలు నెరవేర్చకుండా మా జీవితాలతో చెలగాట మాడారనే ఆక్రోశం వారిలో వ్యక్తమవుతోంది. జిల్లాకు ఏం ఒరగబెట్టారని ఓటేయాలని ఆ వర్గాలు వైసీపీని నిలదీస్తుండటం గమనార్హం.



ప్రచారంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి



కురుబల సమావేశానికి హాజరైన బాలకృష్ణ, బీకే పార్థసారథి

సైకో ప్రభుత్వంతో రాష్ట్రం అల్లకల్లోలం

అభివృద్ధి, సంక్షేమం కావాలంటే ఉమ్మడి ప్రభుత్వం రావాలి

ఎన్నికల ప్రచారంలో బీకే పార్థసారథి

హిందూపురం, మే 9 : సైకో పాలనతో రాష్ట్రం అల్లకల్లోలంగా మారిందని హిందూపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం గోరంట్ల, సోమందేపల్లి మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా బీకే మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందని, ప్రజలకు సంక్షేమం ఒకటే సరిపోదని అభివృద్ధి కూడా ముఖ్యమని తెలిపారు. ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో చెప్పుకోదగ్గ ఒక్క పనికూడా చేయలేదన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతుందని అన్నారు. రాష్ట్రంలో ప్రజలకు రక్షణ కావాలన్నా, రాష్ట్రం అభివృద్ధి జరగాలన్నా ఉమ్మడి ప్రభుత్వంతో సాధ్యం అవుతుందన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో బాబు అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

టీడీపీతోనే కురుబల అభివృద్ధి

రాష్ట్రంలో కురుబ కులస్థులు తెలుగుదేశం పార్టీ వెంటే ఉన్నారని, వారికి కూడా పార్టీ అండగా ఉంటూ పెద్దపీట వేస్తోందని బీకే పార్థసారథి అన్నారు. హిందూపురం జేవీఎస్ ఫంక్షన్‌హాల్‌లో కురుబల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కురుబలకు పెద్దపీట వేసిందన్నారు. తాను పంచాయతీ స్థాయి నుంచి ఎంపీ వరకు ఎదిగానంటే తెలుగుదేశం పార్టీయే మూలమన్నారు. పార్టీ ఎప్పుడూ బడుగు బలహీనవర్గాల కోసం కృషి చేస్తుందని అన్నారు. భవిష్యత్తులో కూడా కులస్థులకు చంద్రబాబు, బాలకృష్ణ అండగా ఉంటారని మనమంతా టీడీపీని బలపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గోరంట్ల ప్రచారంలో మాట్లాడుతూ మండలంలోని అన్ని చెరువులకు సాగు, తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. గోరంట్లలో తెలుగుదేశం పార్టీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్‌తో కలిసి రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్థసారథికి భారీ గజమాలతో స్వాగతం పలికారు. అక్కడ మాట్లాడుతూ వైసీపీ కమీషన్లకు కక్కుర్తి పడటంతో అభివృద్ధి పనులు ముందుకు సాగలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గోరంట్ల మండలంలో ప్రతి చెరువుకు నీరిచ్చే బాధ్యత టీడీపీ తీసుకుంటుందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



గుత్తిలో డీజిల్ షెడ్‌లో కార్మికులతో అంబికా లక్ష్మీనారాయణ



యాడికి సమావేశంలో మాట్లాడుతున్న అంబికా లక్ష్మీనారాయణ

చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి

అనంతపురం టీడీపీ లోక్‌సభ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ

గుత్తి, మే 9: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ అనంతపురం లోక్‌సభ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం గుత్తిఆర్‌ఎస్‌లోని రైల్వే డీజిల్ షెడ్‌లో ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన డీజిల్ షెడ్, సీఅండ్‌డబ్ల్యుతో పాటు పలు విభాగాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణను గెలిపించాలని ఆయన ప్రచారం చేశారు. అనంతరం ఆయన కార్మికులతో మాట్లాడుతూ గుంతకల్లు రైల్వే జోన్ ఏర్పాటుకు ఆహర్నిశలు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గుత్తి రైల్వే జంక్షన్ అభివృద్ధితో పాటు, పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ ఏర్పాటుకు, రైల్వే ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం డీజిల్ షెడ్ నుంచి మెయిన్ రోడ్డులో ఆయన ఇంటింటి ప్రచారం చేపట్టారు. రాష్ట్రంలో పెరిగిపోయిన అరాచకాలు, దౌర్జన్యాలకు చరమగీతం పాడాలంటే టీడీపీకి ఓటు వేసి గెలపించాలని ఆయన అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు ముష్టూరు తిమ్మప్ప, ఎంగన్నపల్లి సర్పంచు భరత్‌కుమార్, న్యాయవాది సోమశేఖర్, డాక్టర్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జావిద్, జనసేన నాయకులు పూల రమణ, గోవింద రాజులు, శ్రీనివాసులు, టీడీపీ నాయకులు శ్రీకాంత్‌చౌదరి, వీరన్న, రాము, వెంకటరాముడు పాల్గొన్నారు.

పోరాడితే విజయం మనదే

యాడికి : పోరాడితే విజయం మనదేనని అనంతపురం టీడీపీ లోక్‌సభ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం యాడికిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి అతికొద్ది సమయం మాత్రమే ఉందని, అంతా కలిసికట్టుగా పోరాడితే కూటమి అభ్యర్థులదే విజయమని తెలిపారు. ప్రతిఓటరును కలిసి కూటమి అభ్యర్థులకు మద్దతు ఇచ్చేలా కృషి చేయాలన్నారు. ఓటింగ్ సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఓటింగ్ శాతం పెరిగేలా అవగాహన పెంచాలని తెలిపారు. పోలింగ్ రోజున వైసీపీ కుట్రలకు తెరలేపడానికి సిద్ధమవుతోందని, వాటిని దీటుగా ఎదుర్కోగలిగితే విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్ రెడ్డి, మండల కన్వీనర్ రుద్రమనాయుడు, నాయకులు రాజశేఖర్‌నాయుడు, ఆదినారాయణ, విక్రమ్, నరసింహచౌదరి పాల్గొన్నారు.

తాగుదాం.. ఊగుదాం..!

ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. నగరంలో గత కొన్ని రోజులుగా దుకాణాలు తీయడమే ఆలస్యం అక్కడ ఇట్టే మద్యం ప్రియులు వాలిపోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉదయం నుంచే మద్యం ప్రియులు బారులు తీరుతున్నారు. ప్రస్తుతం బరిలో నిలిచిన అభ్యర్థులు అటు ప్రచారం.. ఇటు ఓటు కోసం డబ్బులు పంపిణీ చేస్తుండటం మద్యం ప్రియులకు కలిసి వచ్చినట్లైంది. కొందరైతే వివిధ పార్టీల జెండాలు, కండువాలు, టోపీలతో దుకాణాల వద్ద కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కొందరు మద్యం ప్రియులు తాము చేసే పనులు పక్కన బెట్టి డబ్బు, మద్యం కోసం అభ్యర్థుల చుట్టూ తిరుగుతున్నారు. మద్యం దొరగ్గానే పూటుగా తాడి ఊగేస్తున్నారు.

- అనంతపురం సిటీ



నగరంలోని ఓ మద్యం దుకాణాల వద్ద ఇలా...



చీనీ మార్కెట్ బంద్

అనంతపురంరూరల్, మే 9: సాధారణ ఎన్నికల నేపథ్యంలో మార్కెట్ యార్డు ఉద్యోగులు, సిబ్బందిని ఎన్నికల విధులకు కేటాయించిన కారణంగా ఈనెల 12న (ఆదివారం) ఎద్దులు, ఎనుముల సంత, 13న (సోమవారం) చీనీ కాయల మార్కెట్‌ను బంద్ చేస్తున్నట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని రైతులు, వ్యాపారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. ఈ రెండు రోజులు చీనీకాయలు, పశువులను మార్కెట్‌కు తీసుకురావద్దని ఆమె సూచించారు.

ఓటు అమ్ముకోం.. భవిష్యత్తును పోగొట్టుకోం

ఎన్నికల వేళ... ఒక ఉపాధ్యాయుడు వినూత్నంగా ఓటు విలువపై ప్రచారం చేశారు. ఓటును అమ్ముకోం. ఆత్మగౌరవాన్ని, భవిష్యత్తును పోగొట్టుకోలేమని చెబుతూ తన ఇంటిపై ఫ్లెక్సీ అతికించారు. ఉపాధ్యాయుడు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయ్‌భాస్కర్ అనంతపురంలోని జీసస్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తన ఇంటిపైన ఒక ఫ్లెక్సీని పెట్టించారు. ఓటు హక్కును నిజాయతీగా వినియోగించాలని, జీవుల మనుగడకు ప్రాణవాయువు ఎలాగో... ప్రజాస్వామ్యానికి ఓటు ఆక్సిజన్ వంటిదని సూచిస్తూ... ఫ్లెక్సీ అతికించారు. ఉద్యోగుల సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉన్న వ్యక్తికే ఓటు వేస్తామని అందులో స్పష్టం చేశారు. ఆయన వినూత్న పంథా, ఓటుపై ప్రచారం అటుగా వెళ్లే వారిని ఆకట్టుకుంటోంది.

- అనంతపురం విద్య



ఇంటికి తగిలించిన ఫ్లెక్సీ వద్ద విజయ్‌భాస్కర్

బొమ్మా.. బొరుసా..?



ఎమన్నా ఎవరు గెలుత్తారంటావ్? ఆ పార్టీ వోల్లకి ఎన్ని సీట్లు వత్తాయ్? ఇంతకీ మన నియోజకవర్గంలో పరిస్థితి ఏంటంటావ్? ఇదీ ప్రస్తుతం నలుగురు కలిసిన చోట జరుగుతున్న సంభాషణ. ప్రశ్న అడిగిన వారికి అనుకూలంగా సమాధానం వస్తే ఓకే.. లేదంటే పందెమా అంటూ పోటీలు పడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎండల వేడి కాస్త తగ్గినా ఎన్నికల వేడి మాత్రం అంతకంతకూ పెరుగుతూనే ఉంది. ఇది బెట్టింగ్‌కు దారి తీస్తోంది. ఉమ్మడి జిల్లాలో టీడీపీకి పది సీట్లకు పైగా వస్తాయంటూ కొందరు .. లేదు..లేదు వైసీపీకే వస్తాయంటూ మరి కొందరు పోటాపోటీగా బెట్టింగు లకు దిగుతున్నారు. అలాగే కూటమి 110 సీట్లతో అధికారంలోకి వస్తుందని, వైసీపీకి 63 కంటే తక్కువ సీట్లు వస్తాయని పందేలు జరుగుతున్నాయి. దీనికితోడు ఎమ్మెల్యే అభ్యర్థి గెలుస్తారు. వంటివాటిపై జోరుగా బెట్టింగు జరుగుతోంది. అనంతపురం మండలం పరిధిలోనే దాదాపు రూ.50 కోట్లకుపైగా బెట్టింగ్ జరిగినట్లు సమాచారం. ఇప్పటికే మధ్యవర్తుల దగ్గర ఇరు వర్గాల పందెంరాయుళ్లు సొమ్మును కలిపి తీర్పు కోసం ఎదురుచూస్తున్నారు. మరికొందరు ఇప్పటికీ పందేలు కాస్తున్నారు. అలా ఒక్కొక్కరు లక్షల్లో బెట్టింగ్ కాసినట్లు తెలుస్తోంది. సీఎంగా చంద్రబాబు నాయుడా..లేక జగన్ మోహన్‌రెడ్డి అవుతారా అన్నదానిపై ఎక్కువగా బెట్టింగ్ జరిగినట్లు తెలుస్తోంది. అలాగే పరిటాల సునీత గెలుస్తుందని ఎక్కువ శాతం మంది పందెం కాసినట్లు తెలుస్తోంది. అధికార పార్టీ నాయకులు సైతం ఆమే గెలుస్తుందని పందెం కాసినట్లు సమాచారం. గెలిచేదెవరో.. మునిగేదెవరో జూన్ 4న తేలనుంది.

\- అనంతపురం రూరల్

ఈడా.. ఆడా.. కూడా..



ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో కూలీలకు భలే డిమాండ్ ఏర్పడింది. ఒక్కో అభ్యర్థి వెంట ప్రచారానికి వెళ్తే ఒక్కొక్కరికి రూ.500 ఇస్తున్నట్లు సమాచారం. ఇలా రోజంతా ఒక అభ్యర్థి వెంటే ఉంటారు అనుకుంటే పొరపాటే!. పొద్దున ఒక పార్టీ అభ్యర్థి తరఫున ప్రచారం, మధ్యాహ్నం మరో పార్టీ అభ్యర్థి తరఫున, సాయంత్రం ఇంకో అభ్యర్థి వెంట ప్రచారానికి వెళ్తూ జేబు నింపుకుంటున్నారు. అభ్యర్థులు కూడా తమవెంట ఎంత జనం ఉంటే అంత క్రేజ్ ఉంటుందన్న భావనతో... ఎంతమంది వస్తే అంత మందిని తమవెంట వేసుకొని ప్రచారాలు సాగిస్తున్నారు. ఎంత డబ్బు ఖర్చయినా వెనకాడటం లేదు. ప్రచారం రెండు రోజుల్లో ముగియనుండటంతో కూలీలకు డిమాండ్ మరింత పెరిగింది.

\- అనంతపురం ప్రెస్‌క్లబ్

డబ్బు తీసుకుని ఓటేస్తే విలువ ఉండదు



నియోజకవర్గంలో అభివృద్ధి చేసే పార్టీకే ఓటు వేయాలి. డబ్బు తీసుకొని ఓటు వేస్తే విలువ ఉండదు. గత ఎన్నికల్లో వైసీపీ ఆటో డ్రైవర్లకు అనేక హామీలు ఇచ్చింది. నమ్మి అందరం ఓటేశాం. సంవత్సరానికి రూ.10వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఇలా రూ.10వేలు ఇచ్చి.. పెట్రోల్, డీజిల్ 10 సార్లు పెంచి ఆ డబ్బు ఇలాగే లాగేశాడు. తప్పుడు హామీలతో జగన్‌రెడ్డి మోసం చేశాడు. చంద్రబాబు హయాంలో పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగా ఉండేవి. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీలతో వాహనాలు ఇచ్చేవారు. ఐదేళ్లలో సబ్సిడీతో వాహనాలు ఇచ్చిన దాఖలాలు లేవు.

\- శివకుమార్, ఆటోడ్రైవర్, శింగనమల

ఆ మూడు పంచాయతీల్లో వారే కీలకం



తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ప్రతి సార్వత్రిక ఎన్నికల్లోనూ శీర్పి, తగ్గుపర్తి, నరసాపురం పంచాయతీల్లో తిరుగులేని మెజార్టీ సాధిస్తోంది. ఈ గ్రామాల్లో కమ్మ సామాజికవర్గ ఓటర్లే అధికంగా ఉన్నారు. దీంతో అక్కడ పట్టు సాధించడానికి ప్రత్యర్థి పార్టీ విశ్వప్రయత్నాలు సాగిస్తున్నా సాధ్యం కావడం లేదు. ఆ గ్రామాల్లో ఉన్న ఇతర సామాజిక వర్గాలను కలుపుకుని టీడీపీ ప్రతి ఎన్నికల్లోనూ ముందంజలో ఉంటోంది. మండలంలో కొన్ని గ్రామాల్లో వైసీపీ మెజారిటీ సాధించినా ఈ గ్రామాల్లో టీడీపీ మెజారిటీ ప్రత్యర్థి పార్టీని దడ పుట్టిస్తుంది. శీర్పి పంచాయతీలో వెంకటాద్రిపల్లి, శీర్పి, కోనాపురం గ్రామాలున్నాయి.

\- బెళుగుప్ప

అధములైన ప్రధములు





గ్రామానికి సర్పంచే ప్రథమ పౌరుడు. ఎంత పెద్ద సభ జరిగినా సర్పంచుకు ప్రత్యేక గౌరవం ఉంటుంది. తమ గ్రామాన్ని అభివృద్ధి చేయాలని, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఎందరో ఉత్సాహంతో పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసి విజయం సాధించారు. వీరిలో వైసీపీ సానుభూతిపరులే అత్యధికంగా ఉన్నారు. కానీ వారి ఆశలపై ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి నీళ్లుచల్లారు. నిధులు లేవు, విధులూ లేవు. ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు. కనీసం వీధి దీపాలు, బ్లీచింగ్ పౌడర్ చల్లడానికి కూడా పైసల్లేని దైన్యం. మొత్తంపై పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. దీంతో జగన్‌పై ఆగ్రహంగా ఉన్న సర్పంచులు ఆయనను గద్దె దించడానికి సిద్ధమవుతున్నారు.

అనంతపురం న్యూటౌన్

వైసీపీ పాలనలో పంచాయతీలు నిర్వీర్యం

నిధులు లేవు.. విధులూ లేవు..

కేంద్రం నిధులు సైతం పక్కదారి

ఊళ్లొదిలి వలస కూలీలుగా మారిన దైన్యం

జగన్‌ను దించడానికి సిద్ధమంటున్న సర్పంచులు

తమకు అధికారాలు, విధులు లేకుండా చేసిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని గద్దె దించడానికి సిద్ధమంటున్నారు సర్పంచులు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పంచాయతీలపై జగన్ శీతకన్ను వేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులు ఒక్క పైసా కూడా కేటాయించలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అర్ధరాత్రి నిధులు కేటాయిస్తున్నట్లు జీఓ జారీ చేయడం, తెల్లారగానే ఆ నిధులను తిరిగి మరో ఖాతాకు మళ్లించడం వైసీపీ ప్రభుత్వం తంతుగా మారింది. ఆఖరికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులను సైతం రూ.8,629 కోట్లు పంచాయతీలకు చెందకుండా సొంత పథకాల అమలుకు మళ్లించడంతో పంచాయతీల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 63 మండలాలకు గాను 1044 పంచాయతీలు ఉంటే ఇందులో 15 శాతం మాత్రమే తెలుగు దేశం పార్టీ మద్దతుదారులు ఉన్నారు. మిగిలిన వారంతా వైసీపీ సర్పంచులే. అయినా కనికరం లేని ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి సొంత పార్టీ వారికి కూడా షాకిచ్చారన్న ప్రచారం జరుగుతోంది. దీంతో సర్పంచుగా గెలిచి ప్రజలకు సేవ చేయాలన్న ఉత్సాహం ఉన్న వారికి చేదు అనుభవమే ఎదురైంది. ఎన్నికల ముందు సర్పంచులుగా ఎన్నికైన వెంటనే గ్రామంలో అది చేస్తాం.. ఇది చేస్తాం అని హామీలు ఇచ్చిన వారు ఆఖరికి ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో కొందరు.. ఆ పంచాయతీలో తిరగలేక ఇతర రాష్ట్రాలకు వెళ్లి వలస కూలీలుగా మారారన్న చర్చ జరుగుతోంది. ఆర్థికంగా ఉన్న కొందరు ఎన్నికల హామీలు అమలు చేయడంలో భాగంగా ఆయా పంచాయతీల్లో రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టి బిల్లులు రాక ఆర్థికంగా చితికిపోయినట్లు ఆ వర్గాలే చెబుతున్నాయి. ఇంత దారుణమైన పరిస్థితులు తెచ్చిపెట్టిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి బుద్ధి చెప్పడానికి సర్పంచులు సిద్ధంగా ఉన్నట్లు ఆ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

ఆదరణ లేక టీడీపీలో చేరిక

వైసీపీ ప్రభుత్వం నుంచి గానీ, స్థానిక నాయకుల నుంచి గానీ తగిన ఆదరణ లేకపోవడంతో వైసీపీ మద్దతు సర్పంచులు చాలా మంది టీడీపీ కండువా కప్పుకొన్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు పంచాయతీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఈ మధ్య కాలంలోనే అనంతపురం రూరల్ మండలంలోని మన్నీల పంచాయతీ వైసీపీ మద్దతు సర్పంచ్ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి తెలుగుదేశం కండువా కప్పుకొన్నారు. ఇదే తరహాలో పలువురు సర్పంచులు జగన్ పార్టీకి దూరమయ్యారు.

ఓటు అడిగే హక్కు కోల్పోయారు

సర్పంచులుగా ఎన్నికైన వారు వైసీపీ ప్రభుత్వం చేసిన ఘనకార్యానికి ప్రజల వద్దకు వెళ్లి ఓటు అడిగే హక్కును సైతం కోల్పోయారు. ఐదు సంవత్సరాల్లో నిధులు కేటాయించకపోగా.. కేంద్రం విడుదల చేసిన నిధులను సైతం సొంత పథకాల అమలుకు దారి మళ్లించిన ఏకైక ప్రభుత్వంగా చరిత్రలో నిలిచిపోతుంది. పంచాయతీల్లో ఏ ఒక్క చిన్న సమస్యను పరిష్కరించలేని నిస్సహాయ స్థితికి సర్పంచులు చేరారు. ఆఖరికి చెత్త శుభ్రం చేయడానికి కేటాయించిన గ్రీన్ అంబాసిడర్స్‌కు కూడా వేతనం ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వారు ఉద్యోగాలు మానుకున్నారు.



\- ఇస్మాయిల్, రాష్ట్ర కార్యదర్శి, పంచాయతీరాజ్ చాంబర్

బిల్లుల చెల్లింపులు లేక వలసబాట



కేంద్ర ప్రభుత్వం కేటాయించిన 14,15 వ ఆర్థిక సంఘం నిధులను సైతం సొంత తమ పథకాల కోసం రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించింది. గ్రామంలో ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు రాకపోవడంతో సర్పంచులు ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఇతర రాష్ట్రాలకు వలసపోయి తలదాచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని పంచాయతీల్లో రూ.10 లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు బిల్లులు పెండింగ్ పెడితే సర్పంచులు ఎలా మనుగడ సాధిస్తారు. ఇంత చెత్త ప్రభుత్వం ఎక్కడా ఉండదు.

\-కృష్ణమూర్తి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, పంచాయతీరాజ్ చాంబర్

నాలుగు సంవత్సరాలాయె రాకపోకలు ఆగిపాయె...



బెస్తరపల్లి నుంచి జంబుగుంపల మధ్య తెగిపోయిన రహదారి

కుందుర్పి మండల పరిధిలోని బెస్తరపల్లి నుండి జంబుగుంపలకు వెళ్లే రహదారి భారీ వర్షాలకు పూర్తిగా తెగిపోయింది. ఆ రెండు గ్రామాలకు వెళ్లే బస్సులు సైతం ఆగిపోయాయి. నాలుగు సంవత్సరాలైన ప్రభుత్వ పాలకులు పట్టించుకోకపోవడంతో ఆ రెండు గ్రామాల ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు పనులకు శంకుస్థాపనలు చేసి వదిలేసారే తప్ప వాటిని పట్టించుకోని నాయకులు కరువయ్యారు. నాలుగు సంవత్సరాల నుంచి రాకపోకలు ఆగిపోయిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నాయకులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు హామీలు ఇవ్వడం తప్ప నెరవేర్చడంలో విఫలమయ్యారని ఆ గ్రామాల ప్రజలు తీవ్రంగా విమర్శించుకుంటున్నారు.

\- కుందుర్పి

ఖనిజం లూటీ..!

సరిహద్దులు దాటిన ఇనుప ఖనిజం

ఐదేళ్లలో రూ.10 కోట్ల దోపిడీ


అసలు స్థానంలో నకిలీ ఉంచుతున్న వైనం

బరితెగించిన వైసీపీ నాయకులు

రాయదుర్గం, మే 9: ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులో ఉండే ఇనుప కొండలను కొందరు వైసీపీ నాయకులు ఐదేళ్లుగా యథేచ్ఛగా తవ్వేశారు. దాదాపు రూ. 10 కోట్లకు పైగా విలువైన ముడిఖనిజాన్ని దోపిడీ చేసి సరిహద్దులు దాటించి జేబులు నింపుకున్నారు. డీ.హీరేహాళ్ మండలంలోని ఓబుళాపురం, సిద్ధాపురం, మలపనగుడి గ్రామాలకు ఆనుకుని ఉన్న ఇనుప ముడిఖనిజపు కొండల్లో రాత్రిపూట మాత్రమే ట్రాక్టర్లు, టిప్పర్లు తిరుగుతుంటాయి. దీని వెనుక వైసీపీ గ్యాంగ్ వ్యవహారాన్ని చక్కదిద్ది రూ.కోట్లు దోచుకుంటోంది. ఇందులో అధికారులకు కూడా భాగస్వామ్యం ఉన్నట్లు సమాచారం.

సీబీఐ సీజ్ చేసిన ఖనిజాన్ని కూడా..

ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి సంబంధించి జరిగిన అవినీతి, అక్రమాల వ్యవహారంలో తవ్వకాలు సాగిస్తున్న ఇనుప కొండల్లో సీబీఐ సీజ్ చేసిన ఖనిజాన్ని కూడా దోచేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా సీబీఐ 1.5 లక్షల మెట్రిక్ టన్నుల విలువైన ముడి ఖనిజాన్ని సీజ్ చేసింది. అయితే నిల్వ చేసిన ప్రాంతం నుంచి ఆ ఖనిజాన్ని రాత్రి సమయాల్లో వైసీపీ నాయకుల అండతో కొందరు సరిహద్దు దాటించారు. తరలించిన ఖనిజం స్థానంలో ఏ మాత్రం పనికిరాని లో గ్రేడ్ ఖనిజమట్టిని తెచ్చి డంపింగ్ చేస్తున్నారు. ఏళ్ల తరబడి సీజ్ చేసి, నిల్వ చేయడంతో వర్షానికి అందులోని నాణ్యత తగ్గి మట్టిగా మారిందని అధికారులకు చెబుతున్నట్లు సమాచారం.



ఇనుప ముడిఖనిజం కొండలు

ఒప్పందాలతో తరలింపు

ముడిఖనిజాన్ని అక్రమంగా తరలించేందుకు వాహనదారులతో ఒప్పందాలు కుదుర్చుకోవడం వ్యవహారంలోని ఒక పద్ధతి. వైసీపీ నాయకులు ఏ మాత్రం క్షేత్రస్థాయిలో కనిపించకుండా టిప్పర్ల యజమానులకు పూర్తి బాధ్యతను అప్పగించి తరలించేలా ఒప్పందాలు కుదుర్చుకుంటారు. అక్రమంగా తవ్వకాలు చేసిన ఖనిజం, సీజ్ చేసిన ఖనిజం, ఇతర మైనింగ్ లీజు ప్రాంతాలలో నిల్వ ఉన్న ఖనిజాలను అక్కడ నుంచి లోడింగ్ చేసు కుని కర్ణాటకలోని క్రషర్లకు రవాణా చేయడం ఆయా టిప్పర్ల యజమానుల ఒప్పందంలో భాగం. రవాణా పరంగా ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా పూర్తి బాధ్యత టిప్పర్ యజమానులదే. అన్‌లోడింగ్ చేసిన అనంతరం దీనికి సంబంధించిన సొమ్ము వైసీపీ నాయకులు వారికి చెల్లిస్తారు. ఈ పద్ధతి ఐదేళ్ల పాటు యథేచ్ఛగా సాగుతోంది.

తవ్వేసిన లీజు ప్రాంతం




అధికారుల కనుసన్నల్లోనే..

వైసీపీ అధికారంలో ఉండటంతో ఇనుప ముడి ఖనిజం అక్రమ తరలింపును కట్టడి చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. కొందరు ఉన్నతస్థాయి అధికారులు ఈ దందా వెనుక క్రియాశీలక పాత్ర పోషించినట్లు సమాచారం. ముడుపులతో సరిపెట్టుకుని వ్యవహారాన్ని చూసీచూడనట్లుగా ఉంటూ వస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. తీవ్ర స్థాయిలో ఒత్తిడి వచ్చినప్పుడు మాత్రం ట్రాక్టర్లను పట్టుకువచ్చి చిన్నపాటి కేసులు పెట్టి వదిలేసినట్లు పోలీసులపై ఆరోపణలున్నాయి. పైగా పోలీసులకు నెలవారి మామూళ్లు కూడా చెల్లిస్తూ వచ్చినట్లు వైసీపీ నాయకులపై ఆరోపణలు వస్తున్నాయి. ఐదేళ్ల పాటు యథేచ్ఛగా సాగిన ముడి ఖనిజపు లూటీ దందాలో కొందరు వైసీపీ నేతలు కోట్లకు పడగలెత్తి కర్ణాటకలో దర్జాగా వ్యాపార వ్యవహారాలను నిర్వహించుకుంటున్నట్లు ప్రజల్లో చర్చ జరుగుతోంది.

పునాదుల్లో జగనన్న కాలనీలు

కూడేరు, మే 9 : గూడులేని నిరుపేదలకు గూడు కల్పిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి మాటలకు క్షేత్రస్థాయిలో ఆచరణకు ఏమాత్రం పొంతనలేదు. వైసీపీ అధికారంలోకి రాగానే జగనన్న కాలనీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంతో ఆర్భాటం చేశారు. గ్రామాల్లో నిరుపేదలను గుర్తించి గ్రామాలనే నిర్మిస్తామని ముఖ్యమంత్రి ప్రగల్భాలు పలికారు. చివరికి జగనన్న కాలనీల్లో కంపచెట్ల పెరిగిపోయాయి. కూడేరు మండలంలో 19 జగనన్న లేఅవుట్లు ఏర్పాటు చేయగా అందులో 332 గృహాలు మంజూరు చేశారు. ఇందులో 128 ఇళ్లు పూర్తికాగా, 20 ఇళ్లు గోడల వరకు నిర్మాణం చేశారు. మిగిలిన 161 ఇళ్లు బేస్‌మట్టానికి పరిమితం కాగా, 23 ఇళ్లు పునాదుల వద్దే నిలిచిపోయాయి. మండలంలోని కూడేరు 1, కూడేరు 2, కడదరకుంట, చోళసముద్రం, గొట్కూరు, రామచంద్రపురం, తిమ్మాపురం, జయపురం, ముద్దలాపురం, జల్లిపల్లి, అరవకూరు, జల్లిపల్లి, నాగిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో లేఅవుట్లు ఏర్పాటు చేశారు. జగనన్న లేఅవుట్లు అనువుగాని చోట మంజూరు చేయడంతో ఇళ్ల నిర్మాణం నత్తనడకన జరిగాయి. కొన్ని గ్రామాల్లో ఇళ్ల నిర్మాణమే జరగలేదు. దీంతో జగనన్న కాలనీలో కంపచెట్లు పెరిగిపోయాయి. కూడేరు, అరవకూరు, ముద్దలాపురం, గొట్కూరు గ్రామాల్లో మాత్రమే కొంత నిర్మాణాలు చేపట్టగా మిగిలిన గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం నత్తనడకన జరిగాయి. చోళసముద్రం, రామచంద్రపుం గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలే జరగలేదు. అందుకు కారణం గ్రామానికి దూరంగా స్థలాలు కేటాయించడమే. మండల వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం కంటే కంపచెట్ల అధికంగా పెరిగిపోయాయి.



కడదరకుంట గ్రామంలో జగనన్న కాలనీ దుస్థితి

వైసీపీలో అసంతృప్తి

అన్నివర్గాల నుంచి టీడీపీలోకి వలసలు

కరుడుగట్టిన నాయకులు సైతం

వైసీపీని వీడుతున్న వైనం

గుంతకల్లులో గుమ్మనూరు మార్క్



టీడీపీలో చేరుతున్న వైసీపీ ఆవిర్భావం నుంచి ఉన్న కురుబలు

గుంతకల్లు, మే 9: నియోజకవర్గ కేంద్రంలో వైసీపీకి రోజూ ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ప్రతిరోజూ ఏదో ఒక వర్గానికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీ గూటికి చేరుతున్నారు. వైసీపీ శ్రేణుల తీవ్ర అసంతృప్తి జ్వాల ఆ పార్టీకి అశనిపాతంగా మారింది. ఎన్నికల సైరన్ మోగినప్పటి నుంచి టీడీపీలో ఎప్పుడెప్పుడు పార్టీ అభ్యర్థిని ప్రకటిస్తారా? అని వైసీపీ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఎదురు చూశారు. ప్రతిరోజూ టీడీపీ అభ్యర్థి ఎవరంటూ వాకబుచేస్తూ వచ్చారు. గుమ్మనూరు జయరాం పేరును ప్రకటించగానే పోలోమంటూ వైసీపీని వీడి పసుపు కండువాలు తొడుగుతున్నారు. టీడీపీ నుంచి ఒక్క ప్రజాప్రతినిధీ అటువైపు వెళ్లకపోగా, వైసీపీ నుంచి కౌన్సిలర్లు, జడ్పీటీసీ సభ్యుడు, వార్డు ఇన్చార్జిలు, వైసీపీకి ఓటు బ్యాంకు అని చెప్పుకోదగ్గ ముస్లిం, కురుబ వర్గాలు ఆ పార్టీని వీడి టీడీపీకి చేరుతున్నారు. వెళ్లేవారి విషయం తెలిసి వారికి బతిమాలుకోవాల్సిన పరిస్థితి వైసీపీలో ఏర్పడింది.

వైసీపీ చేజారుతున్న గుంతకల్లు

గుంతకల్లు పట్టణం కాంగ్రెస్‌కు ఆ తర్వాత, వైసీపీకి కంచుకోటగా పేరుపొందింది. గుంతకల్లు పట్టణ ఓట్లతో మధుసూదన్, నీలావతి, తదితర కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మెజారిటీలు సాధించారు. 1999లో మినహా టీడీపీకి గుంతకల్లులో ఏ ఎన్నికల్లోనూ లీడ్ సాధ్యపడలేదు. 2014లో టీడీపీ వేవ్‌లోనూ వైసీపీ 500 ఓట్ల పైచిలుకు మెజారిటీని ఇచ్చింది గుంతకల్లు పట్టణం. 2019లో 20 వేల కంటే ఎక్కువ మెజారిటీ పట్టణంలో వైసీపీకి లభించింది. పట్టణంలో ముస్లిం మైనార్టీలు, కురుబలు, ఎస్సీ, ఎస్టీలు, క్రైస్తవుల ఓట్లు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో ఎన్నికల్లో వైసీపీకి మెజార్టీ లభిస్తూ వస్తోంది. ఈ కారణంగా గుంతకల్లు పట్టణ ఓటు ఈ ఎన్నికల్లో అత్యంత కీలకంగా మారింది. విషయాన్ని గ్రహించిన టీడీపీ అభ్యర్థి జయరాం ఎలాగైనా పట్టణంలో ఆధిపత్యాన్ని చాటుకోవడానికి ప్రత్యేక దృష్టిని సారించారు. గుత్తి, పామిడి పట్టణాలు, మూడు మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో టీడీపీకి అనూహ్య స్పందన లభిస్తుండటంతో పట్టణంలోనూ పైచేయి సాధించి తిరుగులేని ఆధిపత్యాన్ని చాటుకోవడానికి వ్యూహాన్ని రచించారు. ఈ నెల 1వ తేదీ నుంచి పట్టణంలో ప్రచార కార్యక్రమాన్ని, చేరికలను ముమ్మరం చేశారు. రోజూ పార్టీని వీడుతుండటంతో వైసీపీకి గుంతకల్లు పట్టణం చేజారే పరిస్థితి ఏర్పడింది.

మైనార్టీలు, కురుబలు, దళితుల ఓట్లే లక్ష్యం

గుంతకల్లు పట్టణంలో అత్యధిక ఓట్లు కలిగిన వర్గంగా వాల్మీకులు నిలుస్తుండగా, అభ్యర్థి జయరాం ఆ సామాజిక వర్గానికి చెందినవారే కావడం సహజంగానే కులస్థుల నుంచి అమోఘమైన మద్దతు లభించింది. తర్వాతి స్థానాలలో ముస్లిం మైనార్టీలు, కురుబలు, ఎస్సీ-ఎస్టీలు ఉన్నారు. అలాగే వైసీపీకి బలంగా ఉన్న క్రిస్టియన్ ఓట్లను కొల్లగొట్టడానికి, పట్టణంలో అధిక సంఖ్యలో ఉన్న రైల్వే ఉద్యోగుల ఓట్లపై కూడా ప్రత్యేక దృష్టిని నిలిపారు. ఆ కృషి ఫలితంగానే వైసీపీ నుంచి నలుగురు కౌన్సిలర్లు, గుంతకల్లు మండల జడ్పీటీసీ సభ్యుడు, వార్డు ఇన్చార్జులు, పాతగుంతకల్లులో పెద్ద ఓటుబ్యాంకుగా ఉన్న పాతగుంతకల్లుకు, కనకవీడు వీధికి చెందిన కురుబలు, పట్టణంలోని ముస్లిం నాయకులను ఆకర్షించి పార్టీలో చేర్చుకున్నారు. వైసీపీకి పట్టున్న ఓట్లపైనే బలమైన దెబ్బతీస్తే తిరుగులేని మెజారిటీ సాధ్యమవుతుందన్న వ్యూహంతో పావులు కదిపారు. టీడీపీలో చేరిన కురుబలు వైసీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలోనే ఉన్నారు. వారు ఇప్పుడు టీడీపీ పక్షాన చేరడంతో అధికార పార్టీ ఓటు బ్యాంకుకు గండిపడిందనే భావించాలి. అలాగే ముస్లిముల్లోని రెండు వర్గాల వారినీ అక్కున చేర్చుకుంటూ టీడీపీ చేస్తున్న ముప్పేట దాడితో వైసీపీ శిబిరంలో గందరగోళం ప్రారంభమైంది. కరుడుగట్టిన వైసీపీ శ్రేణులు పార్టీని వీడుతుండటం, వారి ఓట్లు ఇటు తగ్గి అటు పెరిగితే ప్రతి ఓటూ రెండుగా భావించాల్సిన పరిస్థితిలో ఈ వలసలను ఎలా ఆపాలో తెలియని పరిస్థితి అధికార పార్టీలో నెలకొంది.

ఇదేనా అభివృద్ధి అంటే... అనంతా..!

కాలనీల్లో కనీస వసతుల్లేవ్..: కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి




నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం చేస్తున్న కూటమి అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్, రజకుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న దగ్గుపాటి ప్రసాద్

అనంతపురంరూరల్, మే 9: 'నగరంలోని కొన్ని కాలనీలను చూస్తుంటే.. నగరమా.. లేక పల్లెటూరో అర్థం కావడం లేదు. ఇదేనా ఐదేళ్లలో నువ్వు చేసిన అభివృద్ధి ' అని ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డిపై కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ ప్రశ్నించారు. గురువారం సాయంత్రం నగరంలోని 39వ డివిజన్‌లోని లక్ష్మీనగర్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జక్కీవుల్లా, సీనియర్ నాయకులు గడ్డం సుబ్రమణ్యం ఇందులో పాల్గొన్నారు. దుగ్గుబాటి మాట్లాడుతూ... తమ విజయం ఎప్పుడో ఖాయమైందని, ఇక మెజార్టీ కోసం ప్రచారం చేస్తున్నామని అన్నారు. ప్రజల ఇబ్బందులు చూస్తుంటే చాలా బాధగా ఉందన్నారు. కాలనీల్లో కనీస వసతులు లేవని, డ్రైనేజీలు, తాగునీరు, చివరికీ వీధి లైట్లు కూడా వేయలేని దుస్థితి ఉందని అన్నారు. వందల కోట్ల అభివృద్ధి అంటే ఇదేనా అంటూ ఎమ్మెల్యేపై మండిపడ్డారు. చిన్న పల్లెటూరుకు వెళ్లిన కనీస సౌకర్యాలు మెండుగా ఉంటాయన్నారు. కానీ ఇంత పెద్ద నగరంలో సౌకర్యాలు లేకపోవడం బాధాకరమన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి అంటే ఎంటో చేసి చూపిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్రప్రధాన కార్యదర్శి గౌస్‌మొద్దీన్, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, చంద్రదండు రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు, మాజీ కార్పొరేటర్ వడ్డే భవాని, నాయకులు చేపల హరి, మోహన్‌కుమార్, నెట్టెం బాలకృష్ణ, లక్ష్మీనా యుడమ్మ పాల్గొన్నారు.

రజకుల ఆత్మీయ సమావేశం

నగరంలోని అశోక్ నగర్‌లో భూపాలం ఫంక్షన్ హాల్లో గురువారం రజకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ... దోబీఘాట్లను కబ్జాల చెర నుంచి విడిపించి రజలకుకు అండగా నిలుస్తామన్నారు. బోరు, నీటి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేందుకు టీడీపీ కృషి చేస్తుందన్నారు. తనవంతుగా ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రజక చైతన్య సంఘం అధ్యక్షుడు పరమేశ్వర్, జిల్లా అధ్యక్షుడు మల్లేష్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు క్రిష్ణమూర్తి, రజకసాధికార కమిటీ సభ్యురాలు శోభ, పార్లమెంట్ అధ్యక్షుడు రమేష్‌బాబు పాల్గొన్నారు.


పాతూరులో రోడ్‌షోలో పాల్గొన్న శ్రీలక్ష్మి, బుల్లితెర నటులు

ప్రజల స్పందన మా విజయానికి సంకేతం

ప్రజల స్పందన చూస్తుంటే మా విజయానికి సంకేతమని కూటమి అభ్యర్థి సతీమణి శ్రీలక్ష్మి అన్నారు. గురువారం సాయంత్రం రుద్రంపేట పంచాయితీ చంద్రబాబు కొట్టాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆమె కలసి ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడు తూ..జనం మాపై చూపుతున్న అభిమానం చూస్తుంటే మా విజయాన్ని ఇక ఎవరూ అపలేరన్నారు. కచ్చితంగా భారీ మెజార్టీతోనే గెలుస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

బుల్లితెర నటుల రోడ్డు షో

టీడీపీ తరఫున కార్తీక దీపం ఫేమ్ అర్చన, సీరియల్ నటులు భవానీ, విక్రమాదిత్యరెడ్డి ప్రచారం నిర్వహించారు. రెండో రోజైన గురువారం అనంతపురం అర్బన్ పరిధిలోని పాతూరులో బుల్లితెర నటులు దగ్గుపాటి శ్రీ లక్ష్మితో కలిసి ప్రచారం నిర్వహించారు. పాతూరులోని పవర్ ఆఫీస్, మార్కెట్ వీధి, నీలం థియేటర్ పరిసర ప్రాంతాల్లో రోడ్డు షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బల్లా పల్లవి, రాయలసీమ బలిజ సంఘం యువజన అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

టీడీపీలోకి ఎంపీటీసీ చేరిక

మండలంలోని రాజీవ్ కాలనీ పంచాయతీ ఎంపీటీసీ-2 రహమత్‌బీ టీడీపీ తీర్థం పుచ్చుకు న్నారు. గురువారం నగరంలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఆమెతో పాటు మరో 150 కుటుంబాల వారు దగ్గుబాటి సమక్షంలో పార్టీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ స్వరూపా, టీడీపీ నాయకులు తింగమయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచార పాట పోస్టర్‌ను విడుదల చేస్తున్న పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ప్రకాష్‌రెడ్డిని చొక్కా పట్టుకుని నిలదీయండి

కూటమి రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత

అనంతపురంరూరల్, మే 9: ' ఈ ఐదేళ్లలో నియోజకవర్గంలో ఒక్క చెరువుకు కూడా నీరు ఇవ్వలేదు. జానెడు రోడ్డూ వేయలేదు. అలాంటి ప్రకాష్‌రెడ్డిని వైసీపీ నాయకులే చొక్కాపట్టుకుని నిలదీయాలి. ఈనెల 13న ఎన్నికలు ప్రశాంతంగా ముగిసి బాక్సులు స్ట్రాంగ్ రూంకు తరలించే వరకు ఎవరేమన్నా పట్టించుకోవద్దు. మన దృష్టి అంతా ఎన్నికలపైనే ఉండాలన్నారు. జూన్ 4న ఎవరు తొడ కొడతారో.. ఎవరు మీసం తిప్పుతారో చూద్దాం. అంతవరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఓపిక పట్టండి.. ' అని మాజీ మంత్రి, కూటమి రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత అన్నారు. గురువారం మండలంలోని కట్టకిందపల్లి, ఎంబిపల్లి, ఆలమూరు, ఆకుతోటపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడారు. ఈ ఐదేళ్ల పాలనలో తోపులు ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. ప్రకాష్‌రెడ్డి గెలుపు కోసం సొంత ఆస్తులు అమ్మిన నాయకులకు ఏం చేశాడో ఒక్కసారి ఆలోచించుకోవాలన్నారు. ఎమ్మెల్యే గ్రామాల్లో అభివృద్ధి చేయకపోగా.. టీడీపీ కార్యకర్తలపై దాడులు చేయిం చారన్నారు. వీటిని నియంత్రించాల్సిన పోలీసు లు వారికి కొమ్ముకాస్తూ వీడియోలు తీసి పెట్టేవారన్నారు. ఇలా డిపార్ట్‌మెంట్‌ను సైతం దిగజార్చి ప్రవర్తించిన పోలీసులకు కచ్చితంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జింకా సూర్య నారాయణ, మాజీ జడ్పీటీసీ వేణు గోపాల్, మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పాముదాయి వెంకటేష్, సీనియర్ నాయకులు ఈశ్వరయ్య, ఆలమూరు సూరి, ఓబుళనా యుడు, నాగేంద్రరెడ్డి, రమణ, రాగే మురళీ మోహన్, డీసీబాబు, అనిల్ చౌదరి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి...

అనంతపురం క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి పరిటాల సునీత సమక్షంలో చెన్నేకొత్తపల్లి మండలం యర్రంపల్లి, నరసింగరాయుని పల్లి, చిన్నమొగలయిపల్లి, న్యామద్దల గ్రామాల నుంచి 30 కుటుంబాలు టీడీపీలోకి చేరారు. అలాగే ధర్మవరం నియో జకవర్గం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ సమక్షం లో కనగానపల్లి మండలం దాదులూరు, ఆత్మకూరు మండలం గొరిదిండ్ల, వి.డి.తండా, సిద్దరాంపురం, బి.యాలేరు. తలుపూరు నుంచి 45 కుటుంబాలు, పరిటాల సిద్దార్థ సమక్షంలో అనంతపురం రూరల్ మండలం సిండికేట్ నగర్, కొడిమి గ్రామాల నుంచి 10 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి.

ప్రచార పాట విడుదల

రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత ఎన్నికల ప్రచారానికి సంబంధించిన పాటను ఆమె గురువారం అనంతపురం క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా టీఎన్ఎస్ఎఫ్ అధికార ప్రతినిధి రాప్తాడు గణేష్ ఈ పాటను తయారు చేయించారు.

జోరుగా ప్రచారం

రాప్తాడు : మండలంలోని మరూరు పంచాయతీ పరిధిలోని చాపట్లలో మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు ము రళి సతీమణి ధర్మవరపు ధనలక్ష్మి, కుమారుడు ధర్మవరపు చేతన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

రామగిరి : రామగిరి, కానుగుల కుంట గ్రామాల్లో పరిటాల సిద్దార్థ భార్య తేజస్వి ప్రచారం నిర్వహించారు. పరిటాల జ్ఞాన ఆత్మకూరులో ప్రచారం నిర్వహించారు.


కట్టకిందపల్లిలో పరిటాల సునీతను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

డిగ్రీ దూరవిద్య ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, మే 9: ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ దూరవిద్య పరీక్షా ఫలితాలను గురువారం వీసీ హుస్సేన్‌రెడ్డి విడుదల చేశారు. ఫిబ్రవరిలో దూరవిద్య డిగ్రీ బీఏ, బీకామ్, బీబీఏ తృతీయ సంవత్సరం విద్యార్థులకు నాల్గో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించామన్నారు. మొత్తం 150 మందికి గాను 98 మంది (65 శాతం) పాస్ అయ్యారన్నారు. ఫలితాలను ఎస్కేయూ, స్కూల్స్ 9, మనబడి వెబ్‌సైట్లలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులు రివాల్యుయేషన్ కోసం ఈ నెల 29లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు జీవీ రమణ, బాలసుబ్రహ్మణ్యం, సీఈ డాక్టర్ శ్రీరాములు పాల్గొన్నారు.

బిటెక్, బీఫార్మసీ ఫలితాలు: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్, బీఫార్మసీ నాల్గో సంవత్సరం పరీక్షా ఫలితాలు విడుదల చేశామని డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఏప్రిల్, మేలో బిటెక్ నాల్గో సంవత్సరం ద్వితీయ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్ పరీక్షలకు మొత్తం 14,263 మంది విద్యార్థులు హాజరుకాగా 13,944 మంది (97.76 శాతం) పాస్ అయినట్లు తెలిపారు. అదేవిధంగా బీఫార్మసీ నాల్గో సంవత్సరం ద్వితీయ సెమిస్టర్ (ఆర్19) రెగ్యులర్, సప్లమెంటీరీతో పాటు (ఆర్15) సప్లమెంటరీ పరీక్షలకు మొత్తం 2,492 మందికి గాను 1,958 మంది (78.57 శాతం) పాస్ అయ్యారన్నారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురు డీబార్: ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్షల్లో గురువారం ఐదుగురు విద్యార్థులను డీబార్ చేశామని పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. ద్వితీయ, ఆరు సెమిస్టర్ పరీక్షల్లో ఎస్ఎల్ఎన్ డిగ్రీ కళాశాలలో ముగ్గురు, ఎస్వీ కళాశాల, గుంతకల్లు భ్రమరాంబిక కళాశాలలో ఒకరు చొప్పున మొత్తం ఐదుగురు మాస్ మాస్‌కాపియింగ్‌కు పాల్పడ్డారని తెలిపారు.

వైసీపీ ప్రచారంలో వలంటీర్లు

చెన్నేకొత్తపల్లి, మే 9: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ... ఐదుగురు వలంటీర్లు వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మండలంలోని దామాజుపల్లిలో రెండు రోజులుగా వైసీపీ నాయకులతో కలిసి వలంటీర్లు వరలక్ష్మీ, అమ్మాజాన్, వాసు, వైష్ణవి, ముత్యాలమ్మ ప్రచారంలో పాల్గొంటున్నారు.



ఓటర్లు చైతన్యవంతంగా ఆలోచించాలి : రాచపాళెం

అనంతపురం కల్చరల్, మే 9 : ఓటర్లు చైతన్యవంతంగా ఆలోచించాలని ఏపీ అభ్యుదయ రచయితల సంఘం(అరసం) అధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. అరసం ఆధ్వర్యంలో రూపొందించిన 'ఎన్నికల భారతం' కవితా సంకలనాన్ని గురువారం సాయంత్రం అరసం జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటును నిజాయితీగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శాంతినారాయణ, అరసం జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నానీల నాగేంద్ర, ఏలూరు యంగన్న, వెంకటరామిరెడ్డి, నాగేశ్వరాచారి పాల్గొన్నారు.

చీనీకాయలు టన్ను రూ.34 వేలు


అనంతపురంరూరల్, మే 9: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.34 వేలు, కనిష్ఠంగా రూ.14 వేలు, సరాసరి రూ.21 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 712 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ, ఉపాధి

అనంతపురం క్లాక్‌టవర్, మే 9: నిరుద్యోగ యువతీ, యువకులకు కంప్యూటర్ టెక్నాలజీపై ఉచిత శిక్షణ, ఉపాధి కల్పించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. 60 రోజుల పాటు బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, బేసిక్ ట్యాలీ, లైఫ్ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్, బేసిక్ స్పోకెన్ ఇంగ్లీష్, కస్టమర్ రిలేషన్‌షిప్ స్కిల్స్ కోర్సులలో ఈ శిక్షణ కల్పిస్తామన్నారు. 20-35 సంవత్సరా లు వయస్సు కలిగి ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్ చదివిన అభ్యర్థులు అర్హులని, శిక్షణ అనంతరం సర్టిఫికెట్, ఉపాధి కల్పిస్తామని అన్నారు. మరిన్ని వివరాలకు 73969 50345, 77807 52418ను సంప్రదించాలని కోరారు.

నేడు బీసీల ఆత్మీయ సమావేశం

అనంతపురం అర్బన్, మే 9 : అనంతపురం నగరంలోని యాదవ భవన్‌లో శుక్రవారం బీసీల ఆత్మీయ సమ్మేళన కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య, కురుబ సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ కురబ నారాయణస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు అనంత నగరంలోని యాదవ భవన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి బీసీ నాయకులు, బీసీ సోదరులు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు కోరారు. జిల్లాలోని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులు, ఎంపీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.


వెంకటశివుడు యాద్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

జర్నలిస్టుపై దాడి హేయం : కళ్యాణదుర్గం సీఎం జగన్ పర్యటనలో ఈనాడు జర్నలిస్టు రమేష్‌పై వైసీపీ గుండాలు దాడి చేయడం హేయమని వెంకటశివుడు యాదవ్ ఒక ప్రకటనలో మండిపడ్డారు. గతంలో రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫోటో గ్రాఫర్ కృష్ణపై వైసీపీ గుండాలు విచక్షణా రహి తంగా దాడి చేసి హత్యాయత్నం చేసినా.. ఇంతవరకూ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా పోలీసులు మిన్నకుండిపోయారన్నారు. జర్నలిస్టులపై దాడి చేసిన వైసీపీ మూకలను తక్షణమే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పలువురి శుభాకాంక్షలు : టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన వెంకటశివుడు యాదవ్‌కు పలువురు టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాళ్ల నాగేంద్ర, జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు, కురుబ సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ కురబ నారాయణస్వామి, నాయకులు చెరుకూరి శివ, ముత్యాలప్ప ఆయన్ను సన్మానించారు.

టీడీపీలో చేరేందుకు వస్తున్న వారిపై దాడి

ఆత్మకూరు, మే 9: టీడీపీలో చేరడానికి వస్తున్న వైసీపీ మద్దతుదారులపై వైసీపీ నాయకులు దాడికి పాల్పడిన సంఘటన గురువారం తోపుదుర్తి గ్రామంలో జరిగింది. కనగానపల్లి మండలం తగరకుంట గ్రామానికి చెందిన రాజ్‌కుమార్, వడ్డేమోహన్ వడ్డే శ్రీనివాసులు, వడ్డే లక్ష్మీనారాయణ తదితరులు టీడీపీలో చేరడానికి వస్తుండగా.. వారిని తోపుదుర్తి గ్రామంలో గురువారం రాత్రి వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో రాజ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రాణాలో బయటపడ్డ వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎంపీటీసీ పోతులయ్య, కుమార్ రెడ్డి, మరి కొంతమంది అనుచరులు తమపై దాడి చేశారని ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై మాజీ మంత్రి పరిటాల సునీత తీవ్రంగా స్పందించారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సోదరులు ఓటమి భయంతో ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఎమ్మెల్యేనే చంపండి... నరకండి అంటూ కార్యకర్తలను ప్రోత్సహిస్తున్నాడని, దీనిపై జిల్లా ఎస్పీ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

పరామర్శించిన పరిటాల సునీత,బీకే

వైసీపీ నాయకులు దాడిలో గాయపడిన కనగానపల్లి మండలం తగరకుంట వాసులు గురువారం రాత్రి జిల్లా ఆసుపత్రిలో చేరారు. వారిని పరిటాల సునీత, బీకే పార్థసారథి పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.



గాయపడిన రాజ్‌కుమార్,ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న సునీత, బీకే

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన అధికారులు

- ఏకంగా పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్నే మూసివేసిన వైనం
- అసిస్టెంట్ ఆర్ఓను నిలదీసిన టీడీపీ నేతలు
- కలెక్టర్ జోక్యంతో తెరుచుకున్న పోలింగ్ కేంద్రాలు

అనంతపురం టౌన్, మే 9: కొందరు అధికారులు వైసీపీకి తొత్తులుగా వ్యవహరించడమే కాకుండా ... ఏకంగా ఎన్నికల కమిషన్ ఇచ్చిన నిబంధనలను ఉల్లంఘించి మరీ స్వామి భక్తిని చాటుకొంటున్నారు. ఇలాంటి వ్యవహారాలు ఏకంగా జిల్లా కేంద్రంలోనే వెలుగు చూస్తుంటే... ఇక మారుమూల ప్రాంతాల్లో వీర భక్త అధికారుల తీరు ఎలా ఉంటోందో ఇట్టే అర్థమవుతుంది. కలెక్టరు నిరంతరం శ్రమిస్తున్నా కింద స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో మొదటి నుంచీ అధికారుల నిర్లక్ష్యం కొట్టిచ్చినట్లు కన్పిస్తోంది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయని వారి కోసం గురువారం కూడా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాలను నిర్వహించాలని ఎన్నికల కమిషన్ స్పష్టంగా ఆదేశించింది. అయితే జిల్లా కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏకంగా మూసేశారు. అక్కడ ఏర్పాటు చేసిన గుడారాలను తొలగించారు. దీంతో ఓటు వేయడానికి వచ్చిన కొందరు ఉద్యోగులు వెనుతిరిగారు. విషయం తెలుసుకున్న కూటమి అనంత అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ అక్కడికి చేరుకున్నారు. అక్కడి అధికారులను నిలదీయగా వారు నీళ్లు నమిలారు. అసిస్టెంట్ ఆర్ఓ, తహసిల్దార్ శివరామిరెడ్డి అక్కడికి చేరుకున్నారు. ఎందుకు కేంద్రం మూసివేశారని దగ్గుబాటి అతన్ని ప్రశ్నించగా... ఓటు వేయడానికి ఎవరూ రాలేదని, అందుకే మూసివేస్తున్నామని వింత సమాధానం ఇవ్వడంతో అక్కడున్నవారంతా అవాక్కయ్యారు. అధికార పార్టీకి మేలు చేయడానికే అధికారులు ఇలా చేస్తున్నారని, దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని దగ్గుబాటి హెచ్చరించారు. దీంతో పోలింగ్ కేంద్రాలను అధికారులు తెరిపించి... వచ్చిన వారితో ఓటు వేయించారు. జిల్లావ్యాప్తంగా తొలుత ఇలాగే వ్యవహరించినా... కలెక్టరు ఆగ్రహం వ్యక్తం చేయడంతో అన్ని చోట్ల పోలింగ్ చేపట్టారు. డ్వామా కార్యాలయంలో కూడా అంతర జిల్లా ఓటర్లతో పాటు అత్యవసర సేవల ఉద్యోగులకు ఓటింగ్ నిర్వహించారు.



జూనియర్ కళాశాలలో షామియానాను తొలగిస్తున్న దృశ్యం, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ తహసీల్దార్ శివరామిరెడ్డితో దుగ్గుబాటి వాగ్వాదం

ఎన్నికల నిర్వహణలో ఎక్కడా రాజీపడం

అనంతపురం టౌన్, మే 9: ఎన్నికల నిర్వహణలో కమీషన్ నిబంధనలు కఠినంగా అమలు చేస్తామని, ఆ విషయంలో ఎక్కడా రాజీ పడబోమని కలెక్టరు వినోద్ కుమార్, ఎస్పీ అమిత్‌బర్దర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో వారు మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో ఈ చివరి మూడు రోజులే చాలా కీలకమన్నారు. ఆదివారం ఎన్నికల సామగ్రి సిబ్బందికి అందజేస్తామని, సోమవారం పోలింగ్ ఉంటుందని అన్నారు. శనివారం సాయంత్రం 6గంటలకు ఎన్నికల ప్రచారం, ర్యాలీలు ఆపాలన్నారు. జిల్లాకు కేంద్ర బలగాలు వచ్చాయని, పటిష్ఠ భద్రత చేపడుతున్నామని అన్నారు. ఎన్నికల ప్రశాంతంగా నిర్వహణ కోసం ప్రతి పోలింగ్ కేంద్రంలోను వెబ్‌క్యాస్టింగ్ ఏర్పాటు చేసామన్నారు. ఒక కేంద్రంలో నాలుగు బూత్‌లుంటే అక్కడ అదనంగా వీడియో గ్రాఫింగ్ చేయిస్తామని, సమస్యాత్మక కేంద్రాలలో వెబ్‌క్యాస్టింగ్, వీడియోగ్రాఫింగ్, మైక్రో అబ్జర్వర్, కేంద్రబలగాలతో నిఘా ఉంటుందన్నారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు.

ఎస్సీ, ఎస్టీల ద్రోహి.. జగన్

అనంతపురంరూరల్ : ఎస్సీ, ఎస్టీలను అన్ని విధాలుగా మో సం చేసిన జగన్.. చరిత్రలో ఓ ద్రోహిగా మిగిలిపోయాడని, వైసీపీకి ఎవరూ ఓటు వేయరాదని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ బీసీఆర్ దాస్ సూచించారు. గురువారం కురుగుంటలో ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీలకు రక్షణ కావాలన్నా, సబ్ ప్లాన్ నిధులు దక్కాలన్నా, చివరికి ఎస్సీ, ఎస్టీల భూములు కబ్జా కాకుండా ఉండాలన్నా ఎన్డీఏ కూటమి అభ్యర్థులనే గెలిపించాలని ప్రచారం చేశారు.

441 పోస్టల్ ఓట్లు పోల్

అనంతపురం టౌన్: జిల్లావ్యాప్తంగా 441 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు గురువారం పోలయ్యాయని కలెక్టరు తెలిపారు. ఎనిమిది నియోజకవర్గాలలో 282 మంది ఓటు వినియోగించుకున్నారన్నారు. రాయదుర్గంలో 06, ఉరవకొండలో 13 మంది, గుంతకల్లులో 19మంది, తాడిపత్రిలో 51మంది, శింగనమలలో 12 మంది, అనంతపురం అర్బన్‌లో 163 మంది, కళ్యాణదుర్గంలో 12 మంది, రాప్తాడు నియోజకవర్గంలో 86 మంది ఓటు వినియోగించుకున్నారని కలెక్టరు తెలిపారు. అలాగే అత్యవసర సేవల శాఖలకు చెందిన ఓటర్లు గురువారం 159 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో ఇప్పటికీ జిల్లాలో పోస్టల్‌బ్యాలెట్ ఓటింగ్ శాతం 83.08కు చేరిందని తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గురుప్రసాద్

అనంతపురం క్రైం : అనంతపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గురుప్రసాద్ ఎన్నికయ్యారు. గురువారం ఎన్నికల ఫలితాలు లెక్కించారు. అధ్యక్ష పదవికి గురుప్రసాద్, నారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం పోటీ చేశారు. వీరిలో గురుప్రసాద్ విజయం సాధించారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా రాజేంద్రప్రసాద్, కోశాధికారిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా గోవిందరాజులు, సంయుక్త కార్యదర్శిగా మహేష్‌కుమార్, లైబ్రరీ సెక్రటరీగా సాయినాథ్, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీగా ప్రణీత్‌కుమార్ ఎన్నికయ్యారు.

రాష్ట్రంలో అధికార మార్పు ఖాయం


జంతులూరులో ప్రచారం నిర్వహిస్తున్న పర్వతనేని శ్రీధర్‌బాబు

బుక్కరాయసముద్రం, మే 9: రాష్ట్రంలో టీడీపీ తప్పకుండా గెలుస్తుందని, అధికార మార్పు ఖాయమని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు అన్నారు. గురువారం మండల పరిధిలోని జంతులూరు, బుక్కరాయసముద్రంలోని గిరిప్రసాద్, కేవీఎస్ నగర్ కాలనీల్లో ఆయన ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కన్వీనర్ అశోక్, పొడరాళ్ల రవీంద్రా, రామానాయుడు, కేశన్న, లక్ష్మీనారాయణ ఓబులపతి, గోపాల్, సురేష్ చౌదరి పాల్గొన్నారు. జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పుసుపుల హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో పసులూరు, కొత్తపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

నార్పల : నార్పలలో టీడీపీ జిల్లా నేత ఆలం వెంకటనరసానాయుడు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలం నాగార్జున నాయుడు, ప్రతాప్‌చౌదరి, చంద్రబాబు, హుస్సేన్ పీరా, బాలనాగి, నరేష్, మహేష్‌నాయుడు, రామానాయుడు, బ్రహ్మ, మహేష్ పాల్గొన్నారు.

గార్లదిన్నె :మండలంలోని పెనకచర్ల, కొత్తపల్లి గ్రామంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి, బండారు శ్రావణి సోదరి బండారు కిన్నెరశ్రీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచు పుల్లన్న, మాజీ కాల్వ ప్రెసిడెంట్ పరమేశ్వర్‌రెడ్డి, నారాయణస్వామి, పది కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. కార్యక్రమంలో నరసింహారెడ్డి, చిదంబరప్ప, చంద్ర పాల్గొన్నారు. అలాగే కోటంక, ఇల్లూరు గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీఈసీ విశాలాక్షి, గేట్ కృష్ణరెడ్డి, గుర్రలక్ష్మీనారాయణ, ఆవుల క్రిష్టయ్య, గుత్తా బాలకృష్ణ జయరాం, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

శింగనమల : మండలంలోని పెరవలి, నిదనవాడ చిన్నజలాలపురం గ్రామాల్లో కొట్టాల సురేష్ పుచ్చకాయల రాము, మురళీ, శ్రీనా జగా అమృత విశ్వనాథ్‌రెడ్డి ,ధను సుధాకర్ ప్రచారం నిర్వహించారు.

కోడ్ ఉల్లంఘించి మరీ.. అవినీతి

అనంతపురం సెంట్రల్, మే 9: జేఎన్‌టీయూ అధికారులు కోడ్ ఉల్లంఘించి మరీ అవినీతి పాల్పడుతున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఎలాంటి పనులూ చేపట్టరాదు. అయితే జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ సెల్‌లో ఒక ఉద్యోగి, పరిపాలనా భవనంలోని మరో ఉద్యోగి కలిసి మట్టి తోలే పనులను వారికి నచ్చిన కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అంతేకాకుండా ఒక ట్రాక్టర్ మట్టి తోలి ... రెండు ట్రాక్టర్ల మట్టిని తోలినట్లు బిల్లులు పెట్టి సొమ్ము చేసుకొంటున్నట్లు తెల్సింది. ఈ విషయంపై వర్సిటీ ఇంజనీర్‌ను వివరణ కోరగా.. చెట్లకు మట్టి తోలుతున్నారని, అదీ రూ.30 వేలేనంటూ సమాధానమిచ్చారు.


జేఎన్‌టీయూ పరిపాలనా భవనం వద్ద తోలిన మట్టి

ముగిసిన శిక్షణ తరగతులు

అనంతపురం కల్చరల్, మే 9: రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో హెచ్చెల్సీ కాలనీలోని ఆ సమితి కార్యాలయంలో 15 రోజులుగా నిర్వహిస్తున్న వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతులు గురువారంతో ముగిసాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి చిన్మయా మిషన్ ప్రతినిధి స్వామి ఆత్మవిదానంద సరస్వతి హాజరై చిన్నారులకు రామకృష్ణ పరమహంస జీవిత చరిత్రతో పాటు వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పుస్తకాలను బహుమతిగా అందజేశారు.

నలుగురు వలంటీర్లు, కాంట్రాక్ట్ ఉద్యోగి తొలగింపు

అనంతపురం టౌన్ : జిల్లాలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన మరో ఐదుగురిపై కలెక్టరు వినోద్ కుమార్ వేటు వేశారు. ఇందులో నలుగురు వలంటీర్లు, ఒక కాంట్రాక్ట్ ఉద్యోగి ఉన్నారు. నార్పల మండలం సిద్దరాచెర్ల గ్రామానికి చెందిన వలంటీరు ఎం యామినీ, గార్లదిన్నెకు చెందిన వలంటీర్లు వీరారెడ్డి, శివయ్య, రామాంజినేయులును విధుల నుంచి తొలగించారు. అలాగే అనంతపురం వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో ఆఫీస్ కో- ఆర్డినేటర్‌గా పని చేస్తున్న సయ్యద్ తస్వీర్‌ను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పీపుల్స్ మేనిఫెస్టో విడుదల

అనంతపురం కల్చరల్ : భారత రాజ్యాంగం ప్రకారం ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కర్తవ్యమని, అందుకోసం కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జేవీవీ నగర అధ్యక్ష కార్యదర్శులు రామిరెడ్డి, నాయకులు గాంగేనాయక్, లక్ష్మీనారాయణ, ప్రసాద్, రామకృష్ణ, శశికళ, మన్సూర్ పాల్గొన్నారు.

ప్రజలకు పాలేరులా పనిచేస్తా: కాలవ

బొమ్మనహాళ్, మే 9: తనను గెలిపిస్తే ప్రజలకు పాలేరులా పనిచేస్తానని కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని ఉప్పరహాళ్, శ్రీధరఘట్ట, బండూరు, దేవగిరి, బొమ్మనహాళ్‌లో రోడ్‌షో నిర్వహించారు. ఆయా గ్రామాలలో కాలవ శ్రీనివాసులుకు జనం నీరాజనం పలికారు. ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలతో పెద్ద ఎత్తున తెలుగు తమ్ముళ్లు రోడ్‌షోలో పాల్గొన్నారు. బొమ్మనహాళ్‌లో పెద్ద ఎత్తున గజమాలతో క్రేన్ ద్వారా కొత్తపల్లి సోదరుల ఆధ్వర్యంలో స్వాగతించారు. కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ ఉంతకల్లు వద్ద డ్యాం నిర్మించి రెండు పంటలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. టీడీపీ హయాంలో హెచ్చెల్సీ నీటి కోసం రాత్రి వేళలో కాపలా వెళ్లకుండా సాగునీటిని అందించామని ఈ వైసీపీ పాలనలో ఏ ఒక్కరోజైనా ఆయకట్టుకు సాగునీరు అందాయా అని ప్రశ్నించారు. ఈ రాష్ట్రాన్ని చంద్రబాబు తప్ప ఎవరూ బాగుపరచలేరని అన్నారు. వైసీపీ పాలనలో తొమ్మిదిసార్లు కరెంటు చార్జీలు పెంచారని, టీడీపీ పాలనలో ఒక్కసారి కూడా పెంచలేదని గుర్తు చేశారు. అసమర్థ జగన్‌రెడ్డి పాలనను అంతమొందించేందుకు సామాన్య ప్రజలకు ఓటే పాశుపతాస్త్రం అన్నారు. గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన మెట్టు గోవిందరెడ్డి ఏ ఒక్క అభివృద్ధి పనులు చేయలేదని, అతన్ని గెలిపిస్తే తన వ్యాపార అభివృద్ధి తప్ప నియోజకవర్గ అభివృద్ధి పట్టించుకోడన్నారు.

పలువురు టీడీపీలో చేరిక: బొమ్మనహాళ్ మండలంలోని గోనేహాళ్, ఉంతకల్లు క్రాస్, దేవగిరి గ్రామాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు కాలవ


శ్రీధరఘట్ట రోడ్‌షోలో పాల్గొన్న కాలవ శ్రీనివాసులు


బొమ్మనహాళ్‌లో భారీ జనసంద్రం నడుమ మాట్లాడుతున్న కాలవ

శ్రీనివాసులు సమక్షంలో టీడీపీలో చేరారు. క్లస్టర్ కన్వీనర్ కేశవరెడ్డి, మాజీ జడ్పీటీసీలు కుమ్మరి మల్లికార్జున, వాణిజగన్నాథ్‌రెడ్డి, మాజీ డైరెక్టర్ మహేంద్ర, అప్పారావు, కాంతారావుల ఆధ్వర్యంలో వైసీపీ కార్యకర్తలు నాగేంద్ర, కటిగె నారాయణ, ఆర్‌సీ వన్నూరుస్వామి, వడ్డే ఉమాపతి, రామరాజుతో పాటు 15 కుటుంబాలు పార్టీలోకి చేరారు.

ముస్లింలకు బీజేపీ వ్యతిరేకం కాదు

రాయదుర్గంరూరల్: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలలో ముస్లిం మైనార్టీలకు ఎలాంటి నష్టం జరగదని మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్ అన్నారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నా ఎస్సీ, నా బీసీ, నా మైనార్టీ అంటూ పాట పాడుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారిని ఘోరంగా అవమానించారన్నారు. ఐదేళ్లలో ముస్లిం మైనార్టీలకు వైసీపీ ప్రభుత్వం చేసింది ఏమి లేదన్నారు. రాష్ట్రంలో ఆరు మందికైనా దుల్హన్ పథకం అందించారా అని ఎద్దేవా చేశారు. 2014-19 వరకు తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ముస్లింలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. ఐదేళ్లలో ఇసుక మాఫియా, మద్యం మాఫియా చేసి వేల కోట్ల రూపాయలు దండుకున్నట్లు తెలిపారు. రాయదుర్గం నియోజకవర్గంలో విద్యావంతుడు, సౌమ్యుడు అయిన కాలవ శ్రీనివాసులుకు, ఎంపీ అభ్యర్థి అంబిక లక్ష్మీనారాయణకు సైకిల్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కడ్డిపుడి మహబూబ్‌సాబ్, నాయకులు వినాయక, షబ్బీర్ పాల్గొన్నారు.

నయవంచకుడు సీఎం జగన్

● కూటమి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు


మాట్లాడుతున్న అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గంరూరల్, మే 9: సీఎం జగన్మోహన్ రెడ్డి నయవంచకుడని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు మండిపడ్డారు. గురువారం ప్రజావేదిక వద్ద విప్ కాపు రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, మున్సిపల్ మాజీ చైర్మన్ వైపి రమేష్, మార్కెట్ మాజీ యార్డు చైర్మన్ చౌళం మల్లికార్జున, మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, జనసేన నాయకులు బాల్యం రాజేష్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ స్వార్థానికి ప్రాజెక్టులను నిర్వీర్యం చేశాడన్నారు. గతంలో ప్రతిపక్షంలో వున్నపుడు కూడా ఆయన బీటీపీ ప్రాజెక్టుపై ప్రగల్భాలు పలికారని ఎద్దేవా చేశారు. ఆయన ముఖ్యమంత్రి హోదాలో ఇచ్చిన మాటకే విలువలు లేదన్నారు. కుందుర్పి బ్రాంచ్ కెనాల్ బీటీపీ ప్రాజెక్టుకు సంబంధించిన పనులన్నీ ఆరు వారాల్లోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చి రైతులకు మొండిచేయి చూపిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఇప్పుడు కూడా గతంలో రెండుసార్లు బీటీపీ ప్రాజెక్టుపై కల్లబొల్లి మాటలు చెప్పాడని ఇప్పుడు కూడా అవే మాటలు చెబితే ప్రజలు నమ్మరని బావించిన సీఎం కనీసం బీటీపీ ప్రాజెక్టుపై ఊసెత్తకుండా తప్పించుకుని వెళ్లి పోయాడన్నారు. ఇక్కడ పనిచేసిన మంత్రి ఉషశ్రీచరణ్, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఇద్దరూ కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గ రైతులకు తీరని అన్యాయం చేశారన్నారు. కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబును అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు.

సీఎం జగన్ సభలో అపశ్రుతులు

కళ్యాణదుర్గంరూరల్, మే 9: సీఎం జగన్మోహన్ రెడ్డి నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో అపశ్రుతులు చోటు చేసుకున్నాయి. గురువారం పట్టణంలో సీఎం రోడ్‌షో నిర్వహించారు. రోడ్‌షోకు బ్రహ్మసముద్రం మండలం బోయలదొడ్డి నుంచి బొలేరో వాహనంలో దాదాపు అరవై మంది కార్యకర్తలు వస్తున్న క్రమంలో గొచ్చిరెడ్డిపల్లి సమీపంలో అదుపు తప్పి వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో 40 మంది దాకా స్వల్పంగా గాయపడ్డారు. అందరినీ కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే మల్లిపల్లి నుంచి బొలేరో వస్తుండగా వెనుకవైపు నుంచి వైసీపీ కార్యకర్తలు, బొలెరో వాహనానికి తగిలించారు. బొలెరో వాహనంలో ఉన్న డ్రైవర్‌ను ద్విచక్రవాహనంలో వస్తున్న వైసీపీ కార్యకర్తలు దాడి చేశారు. డ్రైవర్ దినేష్, తల్లి అదే వాహనంలో ఉన్నారు. కుమారుడిని అడ్డుకోబోయిన తల్లి మానసపై దాడి చేసి ఆమెపై ఉన్న బంగారు గొలుసును లాక్కెళ్లారని ఆవేదన వ్యక్తం చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అలాగే సీఎం సభకు ద్విచక్రవాహనంలో వచ్చిన వలంటీర్ తిమ్మరాజు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. సభ ముగిసిన వెంటనే కంబదూరు మండలం అచ్చంపల్లికి ద్విచక్రవాహనంలో వెళుతుండగా ములకనూరు ప్రధాన రహదారి వద్ద ద్విచక్ర వాహనం బోల్తాపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం సీజ్

రాయదుర్గంరూరల్, మే 9: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న 24 బాక్సుల మద్యాన్ని పట్టుకున్నట్లు సబ్ సీఐ మురళీమోహన్ తెలిపారు. గురువారం ఇందుకు సంబంధించి వివరాలను విలేకరులకు సీఐ వివరించారు. మండలంలోని జుంజురంపల్లి గ్రామానికి చెందిన రమేష్ అనే వ్యక్తి 20 బాక్సులు మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా గుమ్మఘట్ట మండలం కేపీ కుంట వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. రాయదుర్గం మండలం పల్లేపల్లి గ్రామానికి చెందిన పరమేష్, లింగప్ప, శ్రీకాంత్ అనే ముగ్గురు ద్విచక్ర వాహనాల్లో మద్యాన్ని తరలిస్తుండగా వాహనాల తనిఖీలో పట్టుబడినట్లు తెలిపారు. నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు.

గుత్తి: అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నబీరసూల్ గురువారం తెలిపారు. గుంతకల్లు రోడ్డులోని రైల్వే బ్రిడ్జి సమీపంలో పట్టణానికి చెందిన చిరంజీవి అనే వ్యక్తి నుంచి 47మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నాలుగు రోజులుగా విద్యుత్ సరఫరా బంద్

విడపనకల్లు, మే 9: మండలంలోని మాళాపురం విద్యుత్ సబ్ స్టేషన్‌కు గుంతకల్లు నుంచి విద్యుత్ సరాఫరా అవుతుంది. మంగళవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు 33.11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వాటిని మరమ్మతులు చేసేందుకు గురువారం సాయంత్రం వరకు సమయం పట్టింది. విద్యుత్ సరఫరా పునరుద్ధరించిన గంటకే గురువారం సాయంత్రం కురిసిన గాలివానకు ఆర్.కొట్టాల వద్ద 33.11 కేవీ విద్యుత్ స్తంభం నేలకొరింది. దీంతో మండలంలోని 12 గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పాడింది. వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

డిగ్రీ దూరవిద్య ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, మే 9: ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ దూరవిద్య పరీక్షా ఫలితాలను గురువారం వీసీ హుస్సేన్‌రెడ్డి విడుదల చేశారు. ఫిబ్రవరిలో దూరవిద్య డిగ్రీ బీఏ, బీకామ్, బీబీఏ తృతీయ సంవత్సరం విద్యార్థులకు నాల్గో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించామన్నారు. మొత్తం 150 మందికి గాను 98 మంది (65 శాతం) పాస్ అయ్యారన్నారు. ఫలితాలను ఎస్కేయూ, స్కూల్స్ 9, మనబడి వెబ్‌సైట్లలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఫెయిలైన విద్యార్థులు రివాల్యుయేషన్ కోసం ఈ నెల 29లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు జీవీ రమణ, బాలసుబ్రహ్మణ్యం, సీఈ డాక్టర్ శ్రీరాములు పాల్గొన్నారు.

బీటెక్, బీఫార్మసీ ఫలితాలు...

జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్, బీఫార్మసీ నాల్గో సంవత్సరం పరీక్షా ఫలితాలు విడుదల చేశామని డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఏప్రిల్, మేలో బిటెక్ నాల్గో సంవత్సరం ద్వితీయ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్ పరీక్షలకు మొత్తం 14,263 మంది విద్యార్థులు హాజరుకాగా 13,944 మంది (97.76 శాతం) పాస్ అయినట్లు తెలిపారు. బీఫార్మసీ నాల్గో సంవత్సరం ద్వితీయ సెమిస్టర్ (ఆర్19) రెగ్యులర్, సప్లిమెంటరీతో పాటు (ఆర్15) సప్లిమెంటరీ పరీక్షలకు మొత్తం 2,492 మందికి గాను 1,958 మంది (78.57 శాతం) పాస్ అయ్యారన్నారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురు డీబార్

ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్షల్లో గురువారం ఐదుగురు విద్యార్థులను డీబార్ చేశామని పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. ద్వితీయ, ఆరు సెమిస్టర్ పరీక్షల్లో ఎస్ఎల్ఎన్ డిగ్రీ కళాశాలలో ముగ్గురు, ఎస్వీ కళాశాల, గుంతకల్లు బ్రమరాంబిక కళాశాలలో ఒకరు చొప్పున మొత్తం ఐదుగురు మాస్ మాస్‌కాపీయింగ్‌కు పాల్పడ్డారని తెలిపారు.

తలరాతలు మార్చేది మహిళలే: గుమ్మనూరు


గుంతకల్లులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న జయరాం


బ్యాలెట్‌లో 1వ నంబరుకు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్న శ్రీనివాసులు

గుంతకల్లు, మే 9: పార్టీల తలరాతలు మార్చే శక్తి మహిళలకు ఉందని, రానున్న ఎన్నికల్లో వైసీపీకి మహిళలే తగిన బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం అన్నారు. గురువారం సాయంత్రం ఆయన పట్టణంలో రోడ్ షో నిర్వహించారు. పాతగుంతకల్లు నుంచి వ్యాపార సముదాయాల వారికి, పట్టణ ప్రజలకు అభివాదాలు తెలుపుతూ ప్రధాన రహదారిలో ప్రచారం చేశారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో ప్రజలను ఉద్దేశించి జయరాం మాట్లాడారు. గుంతకల్లు టీడీపీ టిక్కెట్ తనకు లభించినందుకు వైసీపీ శిబిరంలో ఆందోళన మొదలైందని, పోలింగ్ సమీపించే కొద్దీ వారి ఓటమి వారికి కనిపిస్తోందని అన్నారు. స్వయానా దౌర్జన్యం చేస్తూ తనపై దౌర్జన్యపరుడన్న ముద్రవేయడానికి ఎమ్మెల్యే వెంకట రామిరెడ్డి శతవిధాలా యత్నించాడన్నారు. ఆలూరులో 2014లో 2 వేల ఓట్ల మెజారిటీతో గెలిచిన తనను 2019లో దాదాపు 40 వేల మెజారిటీ లభించిందని, తాను దౌర్జన్యపరుడనైతే అక్కడి ప్రజలు ఆదరించి ఉండేవారు కాదన్నారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు గుమ్మనూరు శ్రీనివాసులు, గుమ్మనూరు నారాయణ స్వామి, పత్తి హిమబిందు, ప్రతాప్‌నాయుడు, తలారి మస్తానప్ప, తలారి సరోజమ్మ, దస్లప్ బాషా, అహ్మద్ బాషా, ఉడదాల ప్రభాకర్, ఫ్రూట్ మస్తాన్, షర్ఫుద్దీన్, ఫక్రుద్దీన్, యాస్మిన్, జనసేన జిల్లా నాయకుడు వాసగిరి మణికంఠ పాల్గొన్నారు. గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో పాతగుంతకల్లులోని బెస్త సంఘ సభ్యులకు పార్టీ కండువాలను వేసి టీడీపీలోకి ఆహ్వానించారు.

గుత్తిరూరల్: చంద్రబాబు నాయుడుతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని గుమ్మనూరు జయరాం సోదరుడు నారాయణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని గొందిపల్లి, చేర్లోపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. జయరాంను గెలిపించాలనివారు ఓటర్లను అభ్యర్థించారు. నాయకులు బర్దివలి, వెంకటనారాయణ, లక్ష్మీనారాయణమ్మ, రంగారెడ్డి యాదవ్, శివశంకర్, నారాయణ స్వామి, కిట్టు, హనుమంతురెడ్డి, ఆదినారాయణరెడ్డి, హరి పాల్గొన్నారు.


చెర్లోపల్లిలో ప్రచారం చేస్తున్న గుమ్మనూరు సోదరులు

పశుగ్రాసం దగ్ధం

బొమ్మనహాళ్ మే 9: మండలంలోని హరేసముద్రం గ్రామంలో గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పశుగ్రాసం పూర్తిగా కాలిపోయింది. స్థానికులు తెలిపిన మేరకు హరేసముద్రం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సంజప్ప అనే రైతు 11 ఎకరాల వరి గడ్డి, ఐదు ఎకరాల జొన్నసొప్ప, నాలుగు ఎకరాల వేరుశనగ సొప్ప నిల్వ చేసుకున్నాడు. గురువారం గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాములకు నిప్పు పెట్టారు. గమనించిన స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా మంటలు అదుపులోకి రాకపోవడంతో జిందాల్ అగ్నిమాపక సిబ్బందికి, రాయదుర్గం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. రూ.1.30లక్షలకుపైగా నష్టం వాటిల్లింది.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం: మండలంలోని హరేసముద్రం గ్రామంలో టీడీపీ కార్యకర్త సంజప్పకు చెందిన గడ్డివాములు కాలిపోవడంతో విషయం తెలుసుకునన్న కొత్తపల్లి తిమ్మిరాజు, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున రూ.30 వేలు ఆర్థికసాయం బాధిత రైతుకు అందించారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

గుంతకల్లుటౌన్, మే 9: గుంతకల్లు-డోన్ రైలు మార్గంలోని తుగ్గలి రైల్వే స్టేషన్ సమీపంలో (50)సంవత్సరాల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర గురువారం తెలిపారు. బుధవారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చిరుత దాడిలో రెండు దూడల మృతి

గుమ్మఘట్ట, మే 9: మండలంలోని మారెంపల్లి గ్రామ శివారులో తోటలలో రైతుల పాకల వద్ద ఉన్న రెండు దూడలపై బుధవారం రాత్రి చిరుత దాడి చేసి చంపేసిందని రైతులు తెలిపారు. అటవీ ప్రాంతం నుంచి చిరుతలు సంచరిస్తున్నాయని అటవీశాఖ అధికారులు వాటి నుంచి కాపాడాలని రైతులు కోరారు. అటవీశాఖ అధికారులు మారెంపల్లిను సందర్శించి చిరుతదాడిలో మృతిచెందిన దూడలను పరిశీలించారు.

'కూటమికే మద్దతు'

గుత్తి, మే 9: పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం నాయకులు కూటమి అభ్యర్థులైన ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ గెలుపునకు కృషి చేస్తామని ఆ సంఘం అధ్యక్షుడు ఎం రమణ ఒక ప్రకటనలో తెలిపారు. బలిజ కులస్థులు జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ నాయకత్వాన్ని బలపరుస్తున్నామన్నారు. ఇందు కోసం తాము ఆయన ఆదేశాలకు కట్టుబడి ఉన్నామన్నారు. 13వ తేదీన జరిగే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపిస్తామన్నారు. సంఘం కార్యదర్శి రామానాయుడు, సహాయ కార్యదర్శి ఈశ్వర్, కోశాధికారి మంజునాథ్, నాగరాంగప్రసాద్, బాలరాజు, కృష్ణమోహన్, రామకృష్ణ పాల్గొన్నారు.


70కుటుంబాలు టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన వారితో బండారు శ్రావణిశ్రీ, అంబికా లక్ష్మీనారాయణ

యల్లనూరు, మే 9: మండలంలోని నీర్జాంపల్లి గ్రామానికి చెందిన సర్పంచు భర్త గోపాల్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 70 కుటుంబాలు బండారు శ్రావణిశ్రీ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో వారు పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు ప్రజలకు మంచి చేస్తాయని ఉద్దేశంతోనే వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నట్లు గోపాల్ తెలిపారు. వీరందరికి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ చేత కండువాలు వేయించి ఆహ్వానించారు.

పుట్లూరు: టీడీపీ కూటమి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండల కన్వీనర్ బాలరంగయ్య ఓటర్లను అభ్యర్థించారు. మండలంలోని అరకటవేముల గ్రామంలో శుక్రవారం ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు.

కూటమి అభ్యర్థుల గెలుపునకు సహకరించండి


టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న జేసీ పవన్‌రెడ్డి

యాడికి, మే 9: ఎన్నికల్లో కూటమి అభ్యర్థి గెలుపు కోసం సహకరించాలని పలువురు నాయకులను టీడీపీనేత జేసీ పవన్‌రెడ్డి కోరారు. గురువారం మండలంలోని రాయలచెరువులో పలువురు సీనియర్ నాయకులు మోటుపల్లి జయరాములు, సీతారాములు, రంజిత్ తదితరులను ఆయన కలిశారు. బెంగళూరు టీడీపీ ఫోరం నాయకుడు పవన్‌తో మాట్లాడారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, గోపాల్‌నాయుడు, అమిలినేని సత్య శ్రీధర్ ఉన్నారు.

తాడిపత్రిటౌన్, సైకిల్ గుర్తుకు ఓటువేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులైన అంబికా లక్ష్మీనారాయణ, జేసీ అస్మిత్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ నాయకులు చింబిలి ప్రసాద్‌నాయుడు ఓటర్లను అభ్యర్థించారు. గురువారం మండలంలోని గన్నెవారిపల్లికాలనీ, పోతులయ్యపాలెంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో రాము, నటరాజు, శ్రీనివాసులు, కోన, గోపాల్ పాల్గొన్నారు.


యువకుడిని ఓటు అడుగుతున్న చింబిలి ప్రసాద్‌నాయుడు

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక


టీడీపీలో చేరినవారితో పయ్యావుల కేశవ్

ఉరవకొండ, మే 9: పట్టణంలోని సీవీవీ నగర్‌కు చెందిన వైసీపీ నాయకులు పయ్యావుల కేశవ్ సమక్షంలో టీడీపీలోకి చేరారు. విశ్వ, వన్నూరుస్వామి, మంజు, శివకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. వజ్రకరూరు మండలం వెంకటాంపల్లికి చెందిన నల్లప్ప, రాజా, నాగన్న, విక్రమ్‌సింహ సమక్షంలో టీడీపీలోకి చేరారు.

తమ్ముడి గెలుపునకు అక్క ప్రచారం


ప్రచారం చేస్తున్న ప్రసన్నమ్మ

కూడేరు: పయ్యావుల కేశవ్‌ను గెలిపించాలని ఆయన సోదరి ప్రసన్నమ్మ గురువారం ప్రచారం చేశారు. హంసాపల్లి, పీఏబీఆర్ డ్యాం తదితర గ్రామాల్లో ఆమె ఇంటింటికీ వెళ్లి కేశవ్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

నేడు కాలవ పర్యటన ఇలా...

రాయదుర్గం, మే 9: కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు శుక్రవారం గుమ్మఘట్ట, కణేకల్లు, రాయదుర్గం మండలాలలో పర్యటించనున్నారు. ఉదయం 8 గంటలకు గుమ్మఘట్ట మండలం నుంచి శిరిగేదొడ్డి, 10 గంటలకు రాయదుర్గం మండలం డీ కొండాపురం, మధ్యాహ్నం 1 గంటకు రాయదుర్గం పట్టణంలో యువతతో ఆత్మీయ కలయిక, మధ్యాహ్నం 3 గంటలకు కణేకల్లు మండలం యర్రగుంట గ్రామంలో రోడ్‌షో, సాయంత్రం 6 గంటలకు పుల్లంపల్లి, 7 గంటలకు పూలచర్ల, 8 గంటలకు నల్లంపల్లి గ్రామాలలో రోడ్‌షో ఉంటుందని తెలిపారు.

ఉరవకొండలో భారీ వర్షం


పట్టణంలో వర్షం పడుతున్న దృశ్యం

ఉరవకొండ, మే 9: పట్టణంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు వర్షం పడింది. స్థానిక పాత బస్టాండ్‌లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. టవర్‌క్లాక్ కూడలిలో వర్షపు నీరు నిలబడటంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలు గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి ఉపశమనం కలిగించింది.

బెళుగుప్ప: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం తేలికపాటి వర్షం కురిసింది. ఇన్ని రోజులు ఎండల తాపంతో అల్లాడిన ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది.

కూలిన విద్యుత్ స్తంభం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. గురువారం ఈదురుగాలికి స్తంభంతో పాటు చెట్టు కూడా కూలింది. ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం కూలిన సమయంలో ఎవరూ అక్కడ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరుగలేదు.

ప్రచారంలో ఉత్కంఠ


ఎదురుపడ్డ టీడీపీ, వైసీపీ కార్యకర్తలు

యల్లనూరు, మే 9: మండలకేంద్రంలో గురువారం సాయంత్రం వైసీపీ, టీడీపీ పార్టీలు ప్రచారాన్ని ఒకే సమయంలో ప్రారంభించడంతో ఉత్కంఠ వాతావరణం నెలకొంది. టీడీపీకి చెందిన ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీతోపాటు పార్టీ శ్రేణులు మండలకేంద్రంలో ప్రచారాన్ని నిర్వహించారు. ఇదే సమయంలో వైసీపీకి చెందిన జడ్పీటీసీ భోగాతి ప్రతాప్‌రెడ్డి ప్రచారం చేస్తూ అక్కడకు రావడంతో ఇరుపార్టీలకు చెందిన కార్యకర్తలు ఎదురుపడ్డారు. దీంతో అక్కడ ఏం జరుగుతుందోనని ఉత్కంఠ నెలకొంది. అయితే ఇరుపార్టీల వారు పక్కకు జరుగుతూ సర్దుకుపోయారు. దీంతో అక్కడున్న వారు ఊపిరి పీల్చుకున్నారు.

చెన్నకేశవస్వామిని దర్శించుకున్న ఎన్నికల అబ్జర్వర్

యాడికి, మే 9: ఎన్నికల అబ్జర్వర్ మనీష్‌సింఘ్ గురువారం యాడికిలోని లక్ష్మీ చెన్నకేశవస్వామిని దర్శించుకున్నారు. ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఆలయ అర్చకుడు హరికృష్ణశర్మ ఆయనకు స్వాగతం పలికారు. స్వామివారికి ఆయన ప్రత్యేక పూజలు చేయించారు. ఆయన వెంట సీఐ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

రాయదుర్గంరూరల్, మే 9: మండలంలోని 74 ఉడేగోళం గ్రామ సచివాలయానికి సంబంధించిన ఆరుగురు వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ అల్లాబకాష్ తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో మల్లికార్జున, మంజునాథ, మల్లమ్మ, శిల్ప, తిప్పేస్వామి, శ్రీకాంత్ రాజీనామా పత్రాన్ని ఎంపీడీఓకు అందించారు. వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లు, సిమ్‌కార్డు, స్కానర్లను స్వాధీనం చేసుకొని రాజీనామాను ఆమోదించినట్లు తెలిపారు.